

నేరస్తులపై.. నిఘా నేత్రాలు

- రౌడీషీటర్లు, దొంగల కదలికలపై మూడో కన్ను
- ప్రధాన కూడళ్లలో ఫేస్ రికగ్నేషన్ కెమేరాల ఏర్పాటు
- పోలీసు రికార్డుల్లోని ఫొటోల డిజిటలైజేషన్.. మ్యాట్రిక్స్ సంస్థకు అప్లోడ్



గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దందాలకు పాల్పడే రౌడీషీటర్లు.. లూఠీలు చేసే దొంగల కదలికల కట్టడికి పోలీస్‌శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు సిద్ధమైంది. ఫేస్ రికగ్నేషన్(ఎఫ్ఆర్‌సీ) పరిజ్ఞానంతో ముఖాల్ని గుర్తించే అధునాతన సీసీ కెమేరాలతో వారిపై నిఘా వేయబోతుంది. నేరస్తులను గుర్తించడమే కాకుండా పోలీసులను అప్రమత్తం చేసే బహుళ ప్రయోజనాలు ఉన్న కెమేరాలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయనున్నారు. ఎక్కడికక్కడ నేరస్తులు, దొంగలు, రౌడీషీటర్ల కదలికలను కట్టడి చేసేలా మ్యాట్రిక్స్ సంస్థతో గతంలో టీడీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అయితే కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా అధునాతన సీసీ కెమేరాలను పర్యవేక్షించే విధానం అమల్లోకి వచ్చే సమయానికి (మిగతా 8వ పేజీలో..)

డయేరియా కారణంగా ఎవరూ మృతి చెందలేదు

- అంజనాపురం కాలనీలో పెద్దఎత్తున సహాయక చర్యలు
- ప్రజలు డయేరియా అని భయపడాల్సిన అవసరం లేదు
- డయేరియా కారణంగా ఒక్క మరణం కూడా జరగలేదు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

8



కలుషితమైన నీటికి కారణమైన బోరును పరిశీలిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, చదలవాడ అరవింద్‌బాబు, ఎంఎల్‌సి జంగా కృష్ణమూర్తి, పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

చిలకలూరిపేటలో పశువుల సంత మూత

సీఎం కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలపై పోలీసుల చర్య

చిలకలూరిపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలో టీడీపీ నాయకుడు మల్లెల రాజేష్ నాయుడికు చెందిన పశువుల సంతను శుక్రవారం పోలీసులు మూసివేయించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో పశువులను ఇక్కడికు తరలిస్తుంటారు. ప్రతి శనివారం సంత జరుగుతుంది. ఈ సంతలో ఆయా పశువుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ఏపీ సీఎం పేషీ అధికారుల ఆదేశాలతో పోలీసులు సంతను తాత్కాలికంగా మూసివేయించారు. శుక్రవారం పెద్ద సంఖ్యలో పోలీసులు సంత వద్ద మోహరించారు. సంతలోకి ఎటువంటి పశువుల వాహనాలు పోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. నిబంధనలు పాటించకుండా పశువుల తరలిస్తున్న కొన్ని వాహనాలపై కేసులు కూడా నమోదు చేశారు. నెల్లూరు దాటాక తమిళనాడుకు సమీపంలో ఓ సంతను తమిళనాడుకు చెందిన వ్యక్తులు నిర్వహిస్తున్నారని సమాచారం. శ్రీకాకుళం నుంచి తమిళనాడు సరిహద్దుల వరకు మధ్యలో ఎటువంటి సంత ఉండటానికి వీలు లేదని అక్కడివారు అంటున్నట్లు తెలిసింది. ఇటీవల రాజేష్‌నాయుడు ఆ సంత వద్దకు వెళ్లి హడావుడి చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో అక్కడి సంత నిర్వాహకులు తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేశారని తెలియవచ్చింది. ఉన్నతస్థాయిలో జరిగిన ఈ వ్యవహారంతో చిలకలూరిపేటలోని సంత మూతబడింది.

మామూళ్ల దౌర్జన్యం!



- రుణం పొందాలంటే డబ్బులు ఇచ్చుకోవాల్సిందే
- ఆర్పీ యానిమేటర్ల దోపిడీ
- ఒక్కోగ్రూపు నుంచి రూ.10 వేల నుంచి రూ.15 వేలు వసూలు
- పొదుపు రుణాల్లోనూ వాటాకు డిమాండ్
- సమావేశ తీర్మానాలు రాసినందుకూ పైకం చెల్లించాల్సిందే

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపుల మహిళలను మామూళ్ల గద్దలు వేధించుకు తింటున్నాయి. డ్వాక్రా సంఘాల్లో ఏ చిన్న పని జరగాలన్నా చేయి తడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్వావలంబన కోసం ఇచ్చే రుణాలు మొదలు అత్యవసర పరిస్థితుల్లో తాము దాచుకున్న పొదుపు డబ్బులపై తీసుకునే రుణాలకు కూడా గ్రూపు సభ్యులైన మహిళలు భారీ మొత్తంలో నగదు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిపై మహిళలు గగ్గోలు పెడుతున్నా ఏమాత్రం వెరవకుండా పట్టణాల్లోని రిసోర్స్‌పర్సన్లు, గ్రామాల్లోని సెర్ప్ యానిమేటర్లు (మిగతా 8వ పేజీలో..)





గిట్టుబాటు గగనం

తెల్ల బంగారం.. తెల్లబోతోంది. సిరులు కురిపించాల్సిన పత్తికి గిట్టుబాటు ధర గగనంగా మారింది. సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై మీనమేషాలు.. రోజురోజుకు ధర పడిపోవడం.. అప్పులకు వడ్డీల భారం పెరిగిపోతుండటంతో రైతులు అందినకాడికి అమ్మేసుకుంటున్నారు. ఇదే అవకాశంగా దళారులు రైతులను దోచుకుంటున్నారు. పంట చేతికి రాకముందు ఆకాశాన్నంటిన ధరలు, ఇప్పుడు నేలను చూస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో పత్తి క్వింటాల్ ధర రూ.5 వేల కంటే తక్కువకు పడిపోయింది. తేమ శాతం ఎక్కువగా ఉందన్న సాకుతో దళారులు రైతు నోట్లో మట్టికొడుతున్నారు. పత్తి క్వింటాల్‌కు మద్దతు ధర రూ.7521గా కేంద్రం ప్రకటించింది. రైతులను ఆదుకోవాల్సిన సీసీఐ, మార్కెటింగ్ శాఖలు చోద్యం చూస్తున్నాయి. పత్తి కోతలు ముమ్మరంగా జరుగుతున్నా ఒక్క కొనుగోలు కేంద్రాన్ని కూడా సీసీఐ ప్రారంభించలేదు.

- దళారుల చెరలో పత్తి రైతులు
- పెట్టుబడీ రాక రైతులు లబోదిబో
- కొనుగోలు కేంద్రాలపై సీసీఐ మీనమేషాలు
- క్వింటాల్‌కు రూ.5 వేల కంటే తక్కువకే కొనుగోలు

నరసరావుపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు.. తెగుళ్లను అధిగమించి పండించిన పత్తికి మార్కెట్‌లో ధర తగ్గింది. విపత్తులు దిగుబడిపై దెబ్బకొడితే వ్యాపారులు ధరలు తగ్గించి సాగుదారులను ఆర్థికంగా నష్టపరుస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2.12 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ముదురు పత్తి చేతికి వస్తుంది. ప్రభుత్వం క్వింటాకు రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. పత్తి కోతలు ముమ్మరంగా సాగుతున్నా కేంద్రాల ఏర్పాటు ఆలస్యం అవుతుంది. అప్పులు తీర్చేందుకు రైతులు పంటను తెగనమ్ముకునే పరిస్థితి నెలకొంది. దీన్ని ఆసరా చేసుకున్న వ్యాపారులు పత్తి ధరను తగ్గించి వేశారు. గ్రామ స్థాయిలోనే వ్యాపారులు కొనుగోళ్లు ఆరంభించారు. గత నెలలో క్వింటా పత్తి రూ 8 వేలు ఉండగా ఇప్పుడు రూ.6,500కు మించడంలేదు. ఇళ్లలో నిల్వ చేసే అవకాశం లేని వారు, అప్పులకు వడ్డీల భారం పెరుగుతుందని కొందరు, ఇంకా ఆగితే ధర మరింత తగ్గుతుందని భయంతో మరికొందరు రైతులు తెగనమ్ముకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో పల్నాడు జిల్లాలో గత వారం పత్తి క్వింటాల్ ధర రూ.5,200 నుంచి రూ.6 వేల వరకు పలికింది. ప్రస్తుతం రూ.5 వేలకు పడిపోయింది. గుంటూరు జిల్లాలో పత్తి క్వింటాల్ ధర రూ.5400 నుంచి రూ.6 వేలుగా ఉంది. రోజురోజుకూ ఎక్కువ పంట చేతికి వస్తుండటంతో వ్యాపారులు ధరలు బాగా తగ్గించేస్తున్నారు. గుంటూరు, తాడికొండ, ప్రత్తిపాడు, ఫిరంగిపురం, చిలకలూరిపేట, నరసరావుపేట, గురజాల, క్రోసూరు, మాచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మార్టూరు, పర్చూరు ప్రాంతాల్లో కేంద్రాల ఏర్పాటుకు మార్కెటింగ్ శాఖ సీసీఐకి ప్రతిపాదనలు పంపింది, ఇందుకు సంబంధించి కేంద్రాల ఇన్‌చార్జిలను కూడా నియమించింది. అయినా కేంద్రాల ఏర్పాటులో సీసీఐ జాప్యం చేస్తుండటం రైతులను తీవ్రంగా నష్టపరుస్తోంది.



దిగుబడులు.. ధరలూ తగ్గాయి..

అధిక వర్షాలు పత్తి దిగుబడులను దెబ్బతీశాయి. ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు రావాల్సిన దిగుబడి 7 నుంచి 8 క్వింటాళ్లకు పడిపోతున్నదని రైతులు వాపోతున్నారు. పత్తి కోత సమయంలో వర్షాలు కురవడంతో కాయ రాలిపోతోంది. పల్నాడులో ప్రస్తుతం పత్తి తీత ఎక్కువగా జరుగుతుంది. వర్షాల ప్రభావంతో ముందు కాపునకు వచ్చిన చేలల్లోని పంట పూర్తిగా పాడైందని రైతులు చెప్తున్నారు. ఇప్పుడు తీస్తున్న పత్తిలో తేమ 20 శాతం ఎక్కువగా ఉందన్న సాకుతో వ్యాపారులు ధరను పూర్తిగా తగ్గిస్తున్నారు. ఎండకు ఆరబెట్టినా అదే ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది గుంటూరు జిల్లాలో 20,145 హెక్టార్లు, పల్నాడు జిల్లాలో సుమారు 1.5 లక్షల హెక్టార్లలో పత్తి సాగైనట్లు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అంచనా. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో మార్కెట్‌లో ధర తగ్గిపోతున్నా విక్రయించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడికి.. రాబడికి పొంతనే లేదు

ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం పత్తి విక్రయాలు చేపడితే రైతులు అప్పుల్లో కూరుకుపోకతప్పదు. పెట్టిన పెట్టుబడికి, వచ్చే రాబడికి పొంతనే లేదు. పత్తి ఎకరా సాగుకు కౌలు రూ.20 వేలు, సాగు ఖర్చులు రూ.10 వేలు, కలుపు, విత్తనాలకు రూ.7400 వరకు పెట్టుబడి అవుతుంది. క్వింటాల్ పత్తి తీసినందుకు రూ.1300 వరకు కూలి కింద పోతుంది. ఎకరానికి సగటున 6 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తే ప్రస్తుతం ఉన్న ధర ప్రకారం రూ.30 వేలు మాత్రమే చేతికి వస్తుంది. అంటే, రైతుకు ఎకరాకు రూ.7,400 వరకు నష్టం వాటిల్లుతుంది. దీనికి తోడు రైతు కష్టం, అప్పునకు వడ్డీలు కలిపితే నష్టం తడిసి మోపెడవుతుంది. సీసీఐ కేంద్రాలు తెరిస్తే రైతుకు కొంతలో కొంత గిట్టుబాటు అవుతుంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈ ఏడాది పత్తికి అనుకూలమైన మద్దతు ధర ప్రకటించినా దానిని అందుకోలేని పరిస్థితుల్లో రైతులు ఉన్నారు. సీసీఐ కేంద్రాలు తెరిస్తే తమకు కొంత న్యాయం జరుగుతుందని రైతులు అంటున్నారు.

రేషన్ పండుగ





- దీపావళికి కందిపప్పు, జొన్నలు
- సబ్సిడీపై కందిపప్పు, 3 కేజీల జొన్నలు ఉచితం
- కార్డు లబ్ధిదారులందరికీ అందించేలా ప్రణాళికలు
- రేషన్ అంటే బియ్యంతో సరిపెట్టిన గత వైసీపీ పాలకులు

గుంటూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు రేషన్‌కార్డుదారులకు ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలిండర్‌తో పేదలపై భారాన్ని తగ్గించిన ప్రభుత్వం కందిపప్పు, జొన్నలు సబ్సిడీపై అందించనుంది. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో రేషన్ దుకాణాల్లో కనిపించని కందిపప్పు కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ రేషన్‌లో దర్శనమివ్వబోతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 14 లక్షల 56 వేల తెల్ల రేషన్‌కార్డులు ఉండగా బాపట్ల జిల్లాలో భాగమైన చీరాల డివిజన్లో మరో రెండున్నర లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. మొత్తంగా మూడు జిల్లాల పరిధిలోని 17లక్షల తెల్ల రేషన్ కార్డుదారులకు నవంబరు నుంచి రాష్ట్ర ప్రభుత్వం బియ్యం, పంచదారతోపాటు కందిపప్పు, జొన్నలను రేషన్ ద్వారా అందించనుంది. ఒక్కో రేషన్ కార్డుపై కిలో కందిపప్పు, గరిష్ఠంగా 3 కిలోల వరకు జొన్నలు అందించాలని నిర్ణయించింది. ప్రతి కార్డుదారుడు జొన్నలు ఉచితంగా పొందవచ్చు. కార్డుపై వచ్చే బియ్యంలో ఎన్ని కిలోల బియ్యం వదులు కుంటే అన్ని కిలోలు(3 కిలోల లోపు) బియ్యానికి బదులుగా జొన్నలు అందిస్తారు. కాగా ఇప్పటికే అక్టోబరులో కొన్ని ప్రాంతాల్లో పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రజలకు రాగులు అందజేసింది.

మూడేళ్ల తర్వాత కందిపప్పు.. ఐదేళ్ల తర్వాత జొన్నలు

2014- 19 మధ్య టీడీపీ ప్రభుత్వ పాలనలో రేషన్ షాపుల ద్వారా సబ్సిడీ బియ్యంతోపాటు, పంచదార, కందిపప్పు, పామాయిల్, గోధుమలు, రాగులు, జొన్నలు, గోధుమ పిండి, శనగలు లభించేవి. 2019లో వైసీపీ అధికారం చేపట్టిననాటి నుంచి ఒక్కొక్కటిగా రేషన్ సరుకులన్నీ మాయమైపోయాయి. ఒకానొక దశలో పంచదార కూడా పేదలకు దక్కలేదు. గత ప్రభుత్వం రేషన్ కార్డులను బియ్యం కార్డులుగా మార్చింది. పైపెచ్చు ప్రతి ఏటా క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ పండుగలకు ఇచ్చే కానుకలు కూడా పేదలకు ఇవ్వకుండా ఎగవేసింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే పేదలకు సబ్సిడీ కందిపప్పు, సరుకులు అందించాలని కృషి చేస్తోంది. ఆ ప్రయత్నం ఇప్పటికిగానీ సాకారం కాలేదు.

29 నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాసు సిలిండర్ పథకం ఈ నెల 29 నుంచి లాంఛనంగా ప్రారంభం కాబోతోంది. దీనికి సంబంధించి విధివిధానాల రూపకల్పన కూడా పూర్తయింది. ఒకేసారి మూడు సిలిండర్లు ఇవ్వడం కంటే నాలుగు నెలలకు ఒకసారి సిలిండర్ ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నెల 29న పథకం ప్రారంభమైన రోజు నుంచి ఉచిత సిలిండర్లు అందుబాటులోకి రానున్నాయి. తొలి సిలిండర్‌ను ఈ నెల 29 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 లోపు ఎప్పుడైనా బుక్ చేసుకోవచ్చు. రెండో గ్యాసు సిలిండర్ ఏప్రిల్ 1 నుంచి జూలై 31లోపు, మూడో సిలిండర్‌ను ఆగస్టు 1 నుంచి అక్టోబరు 31లోపు ఎప్పుడైనా బుక్ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది.



ఇసుక.. 3 రోజులకే

- 3 వేల మెట్రిక్ టన్నుల నిల్వ
- రోజురోజుకు తీవ్రమవుతున్న కొరత
- రీచ్‌ల్లో ఇంకా ప్రారంభంకాని తవ్వకాలు
- పోటెత్తుతోన్న వరదతో ఇప్పట్లో తవ్వకాలు కష్టమే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఇసుక నిల్వలు రోజురోజుకు తరిగిపోతున్నాయి. నిల్వ ఉన్న ఇసుక మూడు రోజులకు మించి సరిపోదని మైనింగ్ శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. మాదిపాడు స్టాక్ యార్డులో మూడు వేల మెట్రిక్ టన్నులు మాత్రమే నిల్వ ఉంది. ఇక్కడి నుంచి రోజుకు వెయ్యి మెట్రిక్ టన్నులను వినియోగదారులకు సరఫరా చేస్తున్నారు. ఈ నిల్వలు అయిపోతే జిల్లాలో ఇసుక దొరికే పరిస్థితి లేదు. రీచుల్లో ఇసుక తవ్వకాలు శుక్రవారం సాయంత్రం వరకు ప్రారంభం కాలేదు. కృష్ణానదికి వరద పోటెత్తుతుండటంతో ఇప్పట్లో ఇసుక తవ్వకాలు జరిగే పరిస్థితి లేదు. ఇసుక కొరత నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇసుక కొరతతో మున్సిపాల్టీలు.. పంచాయతీల్లో ప్రభుత్వ శాఖల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రైవేట్ నిర్మాణ రంగంపై ఇసుక కొరత ప్రభావం రోజురోజుకు అధికమవుతోంది. దీంతో కార్మికుల ఉపాధికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

మైనింగ్‌శాఖ నిర్లక్ష్యంతోనే..

జిల్లాలో నెలకొన్న ఇసుక కొరతకు మైనింగ్ శాఖ నిర్లక్ష్యం కారణంగా ఉంది. కృష్ణానదికి వరద తగ్గిన సమయంలో రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు చేపట్టలేదు. దాదాపు 20 రోజులు తవ్వకాలు చేసే అవకాశం ఉన్నా ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టలేదు. ముందస్తుగా తవ్వకాలు జరిపి ఉంటే కొరత ఏర్పడేదికాదనే వాదన ఉంది. అంబడిపూడిలో మూడు, దిడుగు, కోనూరు, పొందుగలలో ఒక్కొక్క రీచ్‌లో ఇసుక తవ్వకాల కోసం మైనింగ్ శాఖ టెండర్లు నిర్వహించింది. ఈ రీచ్‌ల్లో 4.23 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయని అంచనా. అయితే రీచ్‌ల్లో తవ్వకాల టెండర్లు వారం క్రితం వరకు ఖరారు చేయలేకపోయారు. ఉన్న ఇసుక నిల్వలు ఎన్ని రోజులకు సరిపోతుందో అంచనా ఉన్నా ముందస్తు చర్యలు చేపట్టకపోవడం వల్లే కొరత తీవ్రమైందని చెప్పవచ్చు. వరద తగ్గినా రీచ్‌ల్లో నీటి నిల్వలు తగ్గే వరకు తవ్వకాలు జరిపే అవకాశం ఉండదు. నాగార్జున సాగర్ నుంచి 2,08,862 లక్షల కూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ఆరు ఇసుక రీచ్‌లలో నీరు ప్రవహిస్తోంది. సాగర్ నుంచి నీటి విడుదల పూర్తిగా నిలిపివేసిన అనంతరం వారం వరకు ఇసుక తవ్వకాలు జరిగే అవకాశం ఉండదని మైనింగ్ శాఖ అంచనా వేస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఇసుక నిల్వలపై మైనింగ్ శాఖ దృష్టి సారించాల్సి ఉంది. ఇతర జిల్లాలో ఉన్న ఇసుక నిల్వలకు ఆన్‌లైన్‌లో బుకింగ్‌కు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.



మాదిపాడులో ఇసుక లోడింగ్

అక్రమంగా జిలెటిన్ స్టిక్స్ తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకట్రావు

పిడుగురాళ్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి జిలెటిన్ స్టిక్స్ (మందుగుండు సామగ్రి)ను అక్రమంగా పల్నాడు ప్రాంతంలో విక్రయించేందుకు అనధికారికంగా తరలిస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. పిడుగురాళ్ల సీఐ ఎస్.వెంకట్రావు శుక్రవారం తెలిపిన వివరాల మేరకు పిడుగురాళ్లకు చెందిన వెన్నా రాజశేఖర్‌రెడ్డి (వైసీపీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్), మిర్యాలగూడకు చెందిన మహ్మద్ ఆసిఫ్‌కు జిలెటిన్ స్టిక్స్ విక్రయించే లైసెన్స్ ఉంది. వీరిరువురు అనధికారికంగా నల్గొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన కేతరాజు అంజయ్యకు 200 జిలెటిన్ స్టిక్స్, పిడుగురాళ్లకు చెందిన చంద్రశేఖర ఆజాద్‌కు, నల్గొండ జిల్లా నకరికల్లు మండలం కొడదల మల్లేష్‌కు అక్రమంగా జిలెటిన్ స్టిక్స్ ఉన్న బాక్స్‌లను విక్రయించారు. మందుగుండు సామగ్రిని అక్రమంగా తరలించడం, లైసెన్సు లేకుండా నిల్వ ఉంచడం, లైసెన్స్ లేకుండా క్వారీల్లో పేల్చటం వంటివి చేస్తుండటంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీనికి సబంధించి గతంలో కొందరిని అరెస్టు చేయగా, శుక్రవారం మహ్మద్ ఆసిఫ్, కొడదల మల్లేష్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి ద్విచక్ర వాహనాలు, అక్రమంగా మందుగుండు తరలించే మినీ వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శివనాగరాజు, సిబ్బంది ఉన్నారు.

డిప్యుటేషన్ నిబంధనలకు తూట్లు

- డైట్‌లో ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఉపాధ్యాయులు
- పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత
- పట్టించుకోని ఉన్నతాధికారులు

గుంటూరు (విద్య) అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ శిక్షణ కోసం నిర్వహించే డైట్ సెట్‌లో ఎంపికైన విద్యార్థుల కోసం యడ్లపాడు సమీపంలోని బోయపాలెంలో జిల్లా శిక్షణ కేంద్రం (డైట్) ఏర్పాటు చేశారు. వాస్తవంగా ఇక్కడ రెగ్యులర్ అధ్యాపకుల కంటే పాఠశాల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన అధ్యాపకులు ఎక్కువగా ఉన్నారు. విద్యార్థులు 100లోపు ఉన్నా ఉపాధ్యాయుల సంఖ్య మాత్రం భారీ స్థాయిలో ఉన్నట్లు తెలిసింది. జిల్లా శిక్షణ కేంద్రంలో దాదాపు 15 మందికి పైగా అధ్యాపకులు డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. ఇందులో ముగ్గురు ప్రకాశం జిల్లా నుంచి వచ్చి ఇక్కడ డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. వాస్తవంగా నిబంధనల ప్రకారం డిప్యుటేషన్ కాల పరిమితి మూడేళ్లు. ముగిసిన వెంటనే ఉపాధ్యాయుల్ని వారి మాతృస్థానాలకు పంపాలి. అయితే డిప్యుటేషన్ ముగిసినా ఇక్కడ పని చేస్తూనే ఉన్నారు. వారంతా సబ్జెక్టు టీచర్లు కావడంతో పాఠశాలల్లో ఇబ్బందులు నెలకొంటున్నాయి. అయితే ఈ విషయాన్ని పట్టించుకోకుండా ఉన్నతాధికారులు ఏళ్ల తరబడి వారిని ఇక్కడే ఉంచుతున్నారు. ఫలితంగా పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఏర్పడుతుందని హెచ్ఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏడాది నుంచి మూడేళ్లు..



బోయపాలెంలోని డైట్ కళాశాల

జిల్లా శిక్షణ కేంద్రంలో పని చేయడానికి వచ్చే ఉపాధ్యాయుల కోసం ప్రభుత్వం నియమ, నిబంధనలు ఏర్పాటు చేసింది. అయితే అవి ఇక్కడ అమలు కావడం లేదు. పాఠశాల నుంచి డిప్యుటేషన్‌పై డైట్‌లో పని చేయడానికి వచ్చే ఉపాధ్యాయులు కనీసం సంవత్సరం లేదా గరిష్ఠంగా మూడేళ్లు పని చేయాల్సి ఉంది. అయితే ఈ నిబంధనను తుంగలో తొక్కి ఏళ్ల తరబడి ఉపాధ్యాయులు పాతుకుపోయారు. తాము బోధించాల్సిన అంశాలు తక్కువైనప్పటికీ కొన్నిసార్లు అసలు అధ్యాపకులు పని లేకపోయినా ఇక్కడే ఉంటూ నెలకు లక్షల్లో జీతాలు తీసుకుంటున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు ఇతర వ్యాపకాల్లో మునిగిపోయారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ ఫెషియల్ హాజరు వేసి రియల్ ఎస్టేట్, బిల్డింగ్ నిర్మాణం తదితర రంగాల్లో విధులు నిర్వహిస్తు రెండు చేతులా సంపాదిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అధికారిణి భర్త కోసం నిబంధనలు మార్పు

జిల్లా శిక్షణ కేంద్రంలో పనిచేసే ఓ అధ్యాపకుడిని ఏళ్ల తరబడి ఇక్కడే పని చేసేలా పాఠశాల విద్యా శాఖలో పని చేసే అధికారిణి తన వంతు సహకారం అందిస్తున్నారు. కారణం ఆయన ఆమె భర్త కావడమే. ఆయన ఐదేళ్లకుపైగా ఇక్కడే కొనసాగుతున్నారు. ఇక్కడ పనిచేసే కొంతమంది ఉపాధ్యాయులకు ఇటీవల డిప్యుటేషన్ రద్దయింది. దీంతో తాము పాఠశాలలకు వెళ్తామని సన్నద్ధమైయ్యారు. అయితే సదరు అధికారిణి ససేమిరా అంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. తన భర్తను కూడా ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాల్సి వస్తుందన్న ఆలోచనతో ఆమె డిప్యుటేషన్ నిబంధనలను తుంగలో తొక్కుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఉపాధ్యాయుల ఆందోళన..

జిల్లా విద్యాశాఖలో కీలక విభాగంలో పనిచేసిన సదరు అధికారిణి ప్రస్తుతం పాఠశాల విద్యలో డైరెక్టర్ స్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు. ఆమె ఇక్కడ పనిచేసిన సమయంలో తన కుమారుడికి ఇంట్లోనే ట్యూషన్ చెప్పేలా సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంటి పనులకు కార్యాలయంలో సిబ్బందిని ఉపయోగించడం, ప్రైవేట్ స్కూల్స్ నుంచి భారీ మొత్తంలో నజరానాలు అందుకోవడం, దూరవిద్య పరీక్షల సందర్భంగా అక్రమాలు జరిగాయని కొంతమందిని ఇబ్బంది పెట్టి వారి వద్ద నుంచి భారీ మొత్తంలో దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ అధికారిణి తన భర్త కోసం డిప్యుటేషన్ నిబంధనలను కాలరాస్తున్నారు. డిప్యుటేషన్ ముగిసినా పాఠశాలలకు పంపించడం లేదని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులను మాతృ స్థానాలకు పంపించాలన్న డిమాండ్లు వస్తున్నాయి. త్వరలో పది పరీక్షలకు విద్యార్థుల్ని సన్నద్ధం చేయాల్సిన తరుణంలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా విద్యాశాఖపై ఉంది.

డయేరియా కారణంగా ఎవరూ మృతి చెందలేదు

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డయేరియా కారణంగా ఒక్క మరణం కూడా జరగలేదనీ, ప్రజలు డయేరియా అని భయపడాల్సిన అవసరం లేదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ అంజనాపురం కాలనీలో గత రెండు రోజులుగా కాలనీవాసులు వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతున్నారు. ఇద్దరు మృతి చెందారు. దీంతో శుక్రవారం మంత్రి ఈ ప్రాంతాన్ని సందర్శించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు ఫుడ్‌పాయిజన్ కారణంగా, బండారు చినవీరయ్య అనే 70 ఏళ్ల వృద్ధుడు క్రానికల్ వ్యాధితో బాధ పడుతూ మృతి చెందారని తెలియజేశారు. కాలనీలో మరో 15 మంది వ్యక్తులు వివిధ ఆసుపత్రులలో వైద్యసేవలు పొందుతున్నారని, డయేరియా లక్షణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించిందని, సీఎం చంద్రబాబునాయుడు ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తూ ప్రభుత్వ యంత్రాన్ని, మంత్రులను అప్రమత్తం చేశారన్నారు. అంజనాపురం కాలనీకి పెద్దఎత్తున వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లను నియమించినట్లు తెలిపారు. కానీ ప్రతిపక్షనేత సొంత పత్రిక అబద్ధాలు వండి వారుస్తుందని విమర్శించారు. గత వైసీపీ పాలనలో ఐదేళ్లలో 10 లక్షల 30 వేల 575 మంది అతిసార బారిన పడ్డారని వివరించారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత కలిగి ఉండాలన్నారు.

మైక్రో శాండ్ వాటర్ ఫిల్టర్ మంజూరు

దాచేపల్లిలోని అంజనాపురం కాలనీలో రూ. 25 లక్షల వ్యయంతో మైక్రో శాండ్ వాటర్ ఫిల్టర్ నిర్మించనున్నట్లు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. దాచేపల్లిలోని అంజనాపురం కాలనీలో నివాసముంటున్న 800 మందికి ప్రత్యేకంగా మైక్రో శాండ్ వాటర్ ఫిల్టర్‌ను నిర్మిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, డీఎంఅండ్‌హెచ్ఓ రవి, తహసీల్దార్ కుటుంబరావు, కమిషనర్ అప్పారావు తదితరులున్నారు.

నూతన రైల్వే లైన్ నిర్మాణం అమరావతికి వరం

- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



గుంటూరు(తూర్పు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అమరావతి నూతన రైల్వే లైన్ నిర్మాణంతో రాజధాని ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం నవభారత్ నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతి నూతన రైల్వే లైన్‌కు కేంద్రం ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో నూతన రైల్వే లైన్ నిర్మాణంతో అమరావతి రాజధానికి మహర్దశ పడుతుందన్నారు. రూ.2,245 కోట్ల తో 57 కిలో మీటర్ల మేర నూతన రైల్వే లైన్ నిర్మాణం జరగనున్నట్టు తెలిపారు. కృష్ణానదిపై 3.2 కిలో మీటర్ల మేర పర్యాటకులను ఆకర్షించేలా ఐకానిక్ రైల్వే లైన్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు నిర్మించనున్న నూతన రైల్వే లైన్ రాజధానికి మణిహారంగా నిలవనుందన్నారు. నూతనంగా తొమ్మిది కొత్త రైల్వే స్టేషన్‌లు రావడంతో ఎర్రుపాలెం - నంబూరు మధ్య అన్ని ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ ఏర్పడడంతో పాటు వాహన రద్దీ తగ్గుతుందన్నారు.

దాతల తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి



కోటేశ్వరరావుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జేకేసీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయానికి దాతలు అందజేస్తున్న ఆర్థిక తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు సూచించారు. నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే చేతుల మీదగా శుక్రవారం ప్రవాస భారతీయుడు నూతక్కి రామకృష్ణ ప్రసాదు రూ.50 లక్షల విరాళాన్ని కమ్మ జన సేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు అందజేశారు. అనంతరం కృష్ణప్రసాదు మాట్లాడుతూ దాదాపు రూ.25 కోట్ల విరాళాన్ని ప్రకటించిన రామకృష్ణ ప్రసాదును అభినందిస్తున్నట్టు తెలిపారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి గతంలో రూ.25 కోట్ల విరాళాన్ని నూతక్కి రామకృష్ణ ప్రసాదు ప్రకటించారని, ఇప్పటి వరకు రూ.9 కోట్ల 75 లక్షల సాయాన్ని అందజేశారని వివరించారు. నూతక్కి రామకృష్ణ ప్రసాదు మాట్లాడుతూ త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పాలకవర్గ సభ్యులు వడ్లమూడి నాగేంద్రం, గోరంట్ల పున్నయ్య చౌదరి, గుంటుపల్లి కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

28 నుంచి దూరవిద్య పరీక్షలు

పెదకాకాని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్యా కేంద్రం నిర్వహిస్తున్న పీజీ, యూజీ పరీక్షలు ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని దూరవిద్య పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ డిగ్రీ కోర్సులకు 44 వేల మంది, పీజీ, డిప్లమా కోర్సులకు 15,300 మంది మొత్తం 59,300 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని వివరించారు. అన్ని పరీక్షా కేంద్రాలకు పరిశీలకులను, ప్రత్యేక స్క్వాడ్ బృందాలను, రీజనల్ కోఆర్డినేటర్లను నియమించినట్లు రామచంద్రన్ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

మామూళ్ల దౌర్జన్యం!

(7 పేజీ తరువాయి)

అయినకాడికి మహిళలను దోచేస్తున్నారు.

- మంగళగిరి నగరంలోని ఒక డ్వాక్రా గ్రూపు రుణం తీరిపోవడంతో తాజాగా మరోమారు బ్యాంకు నుంచి రుణం తీసుకుంటున్నారు. రుణ చెల్లింపులు బాగుండడంతో రుణం ఇచ్చేందుకు బ్యాంకు కూడా ఓకే చెప్పింది. కానీ ఆర్పీ మాత్రం తనకు డబ్బులు ఇస్తేనే వ్యవహారం ముందుకు కదులుతుందని అడ్డం తిరిగింది. దీంతో వారు ఒక్కొకరూ రూ. 1,500 చెల్లించి పని పూర్తి చేయించుకున్నారు.
- తుళ్లూరు మండలంలోని ఒక గ్రామంలో ఇదే పరిస్థితి. డ్వాక్రా మహిళలు తాము పొదుపు కింద దాచుకున్న నగదు నుంచి రుణం తీసుకోవాలనుకున్నారు. భారీ మొత్తంలో కాకపోయినా వారికి ఒక్కొకరికి రూ. 20 వేలు రుణం వచ్చింది. అందరూ కలిసి రూ. 2వేలు ఇస్తేనే తాను పని చేసిపెడతానని యానిమేటర్ అడ్డం తిరిగింది. దీంతో వారంతా కలిసి ఆమెకు డబ్బులు ఇచ్చి పని చేయించుకోవాల్సి వచ్చింది. ఇది ఎక్కడో ఒక చోట జరుగుతున్న వ్యవహారం కాదు. జిల్లాలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్పీ, యానిమేటర్ల చేయి తడపకుండా ఒక్క పని కూడా జరగని పరిస్థితి.

లక్షలాది మందిపై ఒత్తిళ్లు

ఉమ్మడి జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో 74,640 స్వయం సహాయక బృందాలు (డ్వాక్రా గ్రూపులు) ఉన్నాయి. వాటిలో ఏడున్నర లక్షల మందికి పైగా మహిళలు సభ్యులుగా ఉంటూ, స్వావలంబన కోసం కృషి చేస్తున్నారు. గ్రూపు నిర్వహణ, సభ్యుల సమావేశం, కార్యకలాపాల్లో సహాయ సహకారాలు అందించేందుకు పట్టణ ప్రాంతాల్లో రిసోర్స్ పర్సన్లను మెప్మా నియమించగా, గ్రామీణ ప్రాంతాల్లో యానిమేటర్లను గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని సెర్ప్ నియమించింది. ఇలా గ్రూపు మహిళలకు సహాయ, సహకారాలు అందించడం కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ ఇప్పుడు రాబందుల వ్యవస్థగా మారింది. డ్వాక్రా మహిళలను పీడించుకుతింటున్నారు. డ్వాక్రా మహిళలు తమకు నగదు చెల్లించడం అనేది తమ హక్కుగా భావించి వారిపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నారు. ఒక్కో పనికి రేటు కట్టి మామూళ్ల వసూళ్లు చేస్తున్నారు.

రుణం పొందాలంటే రూ. 10 వేలు ఇవ్వాల్సిందే

డ్వాక్రా మహిళలు స్వయం సహాయక బృందాలుగా ఏర్పడి ఆర్థిక స్వావలంబన చేసుకునేందుకు ప్రభుత్వం బ్యాంకుల నుంచి రుణ సహాయం చేయిస్తుంది. ఏదో ఒక స్వయం ఉపాధి పొందుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఆ రుణాలు తోడ్పడుతాయి. అవి తీరిన వెంటనే మరోమారు ప్రభుత్వం రుణాలు అందిస్తుంది. నిరంతరం జరిగే ఈ ప్రక్రియను యానిమేటర్లు, ఆర్పీలు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ప్రతిసారి ఇలా రుణం పొందే సమయంలో ఒక్కో మహిళ నుంచి రూ. వెయ్యి నుంచి రూ.1500 వరకూ, లేదంటే గ్రూపు మొత్తంగా రూ.10 వేల నుంచి రూ. 15 వేల వరకూ ఆర్పీలు, యానిమేటర్లు వసూలు చేస్తున్నారు. రుణ దరఖాస్తులు పూర్తి చేయడానికి, తీర్మానాలు రాయడానికి ఈ మొత్తం వసూలు చేస్తున్నారు. మహిళలు ఇవ్వడానికి ఇష్టపడకపోతే మోకాలడ్డి ఆపుతున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా వెరవని స్థితికి చేరారు. ఫిర్యాదులు పెట్టకుండా బెదిరింపులకు దిగుతున్నారు. వీటితోపాటు అత్యవసర సమయంలో పొదుపు డబ్బులపై తీసుకునే రుణాలకు కూడా వీరి మామూళ్ల బాదుడు తప్పడం లేదు. గ్రూపునకు రూ. 2వేల నుంచి రూ. 4వేలు ఇవ్వకుండా పని జరగడం లేదు. వీటితోపాటు ప్రతి నెలా నిర్వహించే గ్రూపు సమావేశంలో సమావేశంలోని అంశాలు, తీర్మానాలు రాసినందుకు రూ. 500 నుంచి రూ. 1000 వరకు వసూలు చేస్తున్నారు. దీంతో డ్వాక్రా మహిళలు లబోదిబోమంటున్నారు.

మామూళ్లు తీసుకుంటే కఠిన చర్యలే



డ్వాక్రా మహిళల నుంచి మామూళ్లు వసూలు చేస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదు. ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశాం. అయినప్పటికీ ఇలాంటి చర్యలు జరుగుతున్నట్లు మా దృష్టికి వస్తోంది. సెర్ప్, మెప్మా పరిధిలో ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడినా అక్కడికక్కడే చర్యలు తీసుకుంటాం. బాధితులు నేరుగా నాకు ఫిర్యాదు చేయవచ్చు.

- విజయలక్ష్మి, పీడీ డీఆర్‌డీఏ, మెప్మా(ఎఫ్ఏసీ)

నేరస్తులపై.. నిఘా నేత్రాలు

(7 పేజీ తరువాయి)

రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మ్యాట్రిక్స్ సంస్థతో జరిగిన ఒప్పందంలో స్కాం జరిగిందని ప్రాజెక్టును ప్రభుత్వం బ్లాక్ లిస్టులో పెట్టి మూలన పడేసింది. ఫలితంగా నేరాలు, రోడ్డు ప్రమాదాలు, దొంగలు, చైన్ స్నాచింగ్ నేరస్తులు చెలరేగిపోయారు. అసాంఘిక శక్తులు పెట్రేగాయి. సీసీ కెమేరాలు అందుబాటులో లేకపోవడంతో ఎంతటి పెద్ద నేరాలు జరిగినా నేరస్తులను పోలీసులు గుర్తించలేకపోయారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీస్ శాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే మార్గాలపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. ఈ క్రమంలో గతంలో మ్యాట్రిక్స్ సంస్థ ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించి పూర్తిస్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని రైల్వేస్టేషన్లు, బస్టాండ్లతో పాటు కొన్ని రహస్య ప్రాంతాల్లో ఫేస్ రికగ్నేషన్ కెమేరాలను ఏర్పాటు చేయనున్నారు. జన సమర్థంగా ఉండే కూడళ్లు, ఇతర ముఖ్య ప్రదేశాల్లో కూడా మ్యాట్రిక్స్ కెమేరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన పోలీసు అధికారులు ఎస్‌హెచ్‌వోల వారీగా ఆదేశాలు జారీ చేశారు. ఈ కెమేరాల ఏర్పాటుతో నేరస్తుల కదలికలను పసిగట్టి నేరాలను కట్టడి చేయడంతో పాటు నేరం జరిగిన తర్వాత వారిని పట్టుకునే సౌలభ్యం కూడా ఉంటుందని పోలీసు శాఖ భావిస్తోంది. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్ల ఫొటోలను తీయించి డిజిటలైజేషన్ చేసి మ్యాట్రిక్స్ సంస్థకు అప్‌లోడ్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లలో పోలీసు శాఖ నిమగ్నమైంది. భవిష్యత్‌లో ఫేస్ రికగ్నేషన్ కెమేరాలను ప్రైవేటు సంస్థలు ఏర్పాటు చేసుకుంటే వాటిని కూడా మ్యాట్రిక్స్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసే అవకాశం ఉంది. తద్వారా నేరస్తులు ఏ ప్రాంతానికి వెళ్లినా ఇట్టే పసిగట్టే అవకాశం ఉంటుంది.

గుర్తింపు.. వెంటనే అప్రమత్తం

రోడ్లు, ఇళ్లు, కార్యాలయాల వద్ద జన సంచారాన్ని రికార్డు చేసేందుకు సాధారణంగా సీసీ కెమేరాలను ఏర్పాటు చేస్తుంటాం. ఇలాంటి వాటినే గతంలో పోలీస్ శాఖ కూడా వినియోగించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మ్యాట్రిక్స్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా మనిషి ముఖాన్ని(ఫేస్ రికగ్నేషన్) గుర్తించడమే కాకుండా అప్పటికే తమ వద్ద అప్లోడ్ అయిన వ్యక్తుల కదలికలను పసిగట్టి వెంటనే కంట్రోల్ రూమ్ ద్వారా అప్రమత్తం చేయడం మ్యాట్రిక్స్ సంస్థ ఏర్పాటు చేసే సీసీ కెమేరాల పత్యేకత. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ సిగ్నల్స్ జంప్ చేసే వాహనాల నెంబర్లను గుర్తించడమే కాకుండా ఆ డేటా ప్రకారం సంబంధిత యజమానికి ఆన్‌లైన్లోనే చలానా పంపే పరిజ్ఞానం ఉంది. నైట్‌విజన్ కెమేరాలను, 360 డిగ్రీల రేడియస్ కలిగిన కెమేరాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది.



ఎస్పీలతో ఐజీ సమీక్ష

మూడు రోజుల క్రితం గుంటూరులో రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తన కార్యాలయంలో రేంజి పరిధిలోని ఎస్పీలతో నిర్వహించిన సమీక్షలో సీసీ కెమేరాలపై ప్రధానంగా చర్చించారు. దీంతో అన్ని ప్రధాన కూడళ్లలో సీసీ కెమేరాలు ఏర్పాటుతో పాటు రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా ఎస్పీలు అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలకు ఆదేశించారు. స్టేషన్ల పరిధిలో రౌడీషీట్లు తెరిచిన సమయంలో తీసిన రౌడీషీటర్ల ఫొటోల ఆధారంగా డిజిటలైజేషన్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. వాటిని పీడీఎఫ్ ఫార్మాట్లో రౌడీషీటర్ సమగ్ర సమాచారంతో మ్యాట్రిక్స్ సంస్థకు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. తదుపరి దొంగలు, కేడీలు, సస్పెక్టెడ్ షీటర్స్ ఫొటోలను కూడా అదేవిధంగా అప్లోడ్ చేయాలని నిర్ణయించారు. అందరి ఫొటోలను మ్యాట్రిక్స్ సంస్థతో అనుసంధానం చేసిన తర్వాత ఆయా వ్యక్తులు రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లినా వారి కదలికలను ఫేస్ రికగ్నేషన్ కెమేరాలు పసిగట్టి కంట్రోల్ రూమ్‌లో ఉండే సిబ్బందిని అప్రమత్తం చేస్తాయి. దీంతో పోలీసులు వారి కదిలికలను పసిగట్టి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా నేరాలను అరికట్టడానికి సాధ్యమవుతుంది.

అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ కేశవరెడ్డి

బాపట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీ ప్రక్రియ రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ పంచాయతీరాజ్ జాయింట్ డైరెక్టర్ ఆర్.కేశవరెడ్డి తెలిపారు. బాపట్ల విస్తరణా శిక్షణ కేంద్రంలో జిల్లా స్థాయి అధికారులు, రీసోర్స్ పర్సన్‌లకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కేశవరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ అభివృద్ధి ప్రణాళిక సక్రమంగా తయారు చేయకపోవటం, ఆన్‌లైన్‌లో ఆడిట్ జరగకపోవటం వలన గతేడాది గ్రామ పంచాయతీలు, 27 మండల పంచాయతీలు, 4 జిల్లా పంచాయతీలు కేంద్ర ప్రభుత్వ నిధులు పొందుటకు అర్హత కోల్పోయినట్లు తెలిపారు. ప్రణాళిక ప్రక్రియ ఖర్చు నమోదులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్ర నిర్వహణలో పని చేస్తున్న క్లాప్ మిత్రలకు వేతనాల చెల్లింపులు చూపకపోవడంతో వేతనాలు చెల్లించే అవకాశం లేకుండా పోయిందన్నారు. జాయింట్ డైరెక్టర్ జె.రామనాథం, కోర్సుడైరెక్టర్ శ్రీనివాసరావు, రీసోర్స్‌పర్సన్‌లు ఎం.వి.సుబ్బారావు, కన్సల్టెంట్ డాక్టర్ మోహనరావు, డాక్టర్ ఏడుకొండలు పాల్గొన్నారు.

క్రికెట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం

సత్తెనపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శరభయ్య గుప్తా హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం భాష్యం స్కూల్ ఆధ్వర్యంలో క్రికెట్ ప్రీమియర్ లీగల్‌ను పట్టణ ఎస్ఐ సంధ్యారాణి ప్రారంభించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సుందరరావు, పీఈటీలు రాజేష్, కిరణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

జోన్ డైరీ

ముప్పాళ్ళలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని మండల టీడీపీ అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తరలి వచ్చి తమ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని కోరారు.



నూతన సర్వీసుని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

మాచర్ల డిపోకు 8 నూతన బస్సు సర్వీసులు

మాచర్లటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ఆర్టీసీ పరిధిలో ప్రయాణికుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం 8 నూతన బస్సు సర్వీసులను ఏర్పాటు చేసిందని మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం నూతన బస్సు సర్వీసులను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బెంగళూరు, చెన్నైలతో పాటు మంగళగిరిలోని ఎయిమ్స్‌కు బస్సు సర్వీసులను ఏర్పాటు చేసిందన్నారు. ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి కోరారు.

సీజనల్ వ్యాధులపై

అవగాహన కల్పించండి

పిడుగురాళ్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలలో మరింత అవగాహన కల్పించి ఆరోగ్యంపట్ల తగు జాగ్రత్తలు పాటించేలా చూడాలని పల్నాడు జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వఓ డాక్టర్ పద్మావతి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి తెలిపారు. శుక్రవారం కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు అకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులు పరిశీలించి వైద్యసిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కరాలపాడు వైద్యాధికారులు కెవి నాగిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

వీవోఏలను

విధుల్లోకి తీసుకోవాలి

క్రోసూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ కారణాలతో వీవోఏలను తొలగించటం అక్రమమని, వారి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం క్రోసూరులోని మండల సమాఖ్య కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 27 మంది వీవోఏలను అక్రమంగా తొలగించారని, హైకోర్టు కూడా వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గంజిమాల రవి బాబు అన్నారు.

పారదర్శకంగా పశుగణన

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పశు గణనను పారదర్శంగా నిర్వహించాలని పశు సంవర్ధక శాఖ అధికారులు, సిబ్బందిని ఆ శాఖ జిల్లా ఉప సంచాలకులు డాక్టర్ రామారావు ఆదేశించారు. మండలంలోని నందిగామ, గుడిపూడి గ్రామాల్లో జీవాలకు నత్తల నివారణ మందు పంపిణీ కార్యక్రంలో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులతో పాటు రైతులు, ప్రజా ప్రతినిధులు స్వచ్ఛందంగా పశుగణన కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు.

ప్రారంభించారు.. వదిలేశారు !

పేరుకి నియోజకవర్గ కేంద్రం పెదకూరపాడులో సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం ప్రారంభించి నెలలు గడిచినా నేటికీ ఆయా భవనాల్లో సేవలను ప్రారంభించలేదు. గత వైసీపీ ప్రభుత్వం ప్రారంభించటంలో చూపిన అత్యుత్సాహాన్ని అనంతరం పెండింగ్ పనులను పూర్తిచేసి, మౌలిక సదుపాయాలు కల్పించి వైద్య సేవలను అందించటంలో ఏమాత్రం చూపలేదు. దీంతో నూతన ఆస్పత్రి భవనాలు అలంకారప్రాయంగానే దర్శనమిస్తున్నాయి. మరోవైపు పాత ఆస్పత్రి భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారాయి.

- గత వైసీపీ ప్రభుత్వ ప్రచార్భాటం కోసం పనులు పూర్తి కాకుండానే భవనాలు ప్రారంభం
- బిల్లులు రాలేదని పనులు ఆపివేసిన కాంట్రాక్టు కంపెనీ
- అలంకార ప్రాయంగా నూతన ఆస్పత్రి నిర్మాణం
- నేటికి పాత భవనంలోని వైద్య సేవలు

పెదకూరపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గకేంద్రమైన పెదకూరపాడులో గ్రామీణ ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రూ.8.60 కోట్ల నాబార్డ నిధులను 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి మంజూరు చేసింది. పనులు పూర్తిస్థాయిలో పూర్తికాకున్నా గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు ఈ ఏడాది ఫిబ్రవరి 29న ఎంతో ఆర్భాటంగా ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించారు. అయితే ప్రారంభోత్సవం జరిగి ఎనిమిది నెలలు అవుతున్నా సదురు కాంట్రాక్టు సంస్థ 'మెగా ఇంజనీరింగ్' వారు నేటికీ పెండింగ్ పనులను పూర్తి చేయలేదు. బిల్లులు రాకపోవడం వలనే పనులు పూర్తిచేయలేక పోయామని కంపెనీ ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. దీంతో పాత ఆస్పత్రిలోనే వైద్య సేవలు కొనసాగుతున్నాయి.



పెచ్చులూడుతున్న పాత ఆస్పత్రి భవనం శ్లాబు



ప్రమాదభరితంగా పాత ఆస్పత్రి

1994లో నిర్మించిన పాత ఆస్పత్రి శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారింది. గదుల్లో శ్లాబ్ పెచ్చులూడి పడుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా వర్షపు నీరు కారటంతో ఆరోగ్య సిబ్బంది విధులు నిర్వాహణకు ఆటంకంగా మారింది. రోగులు కూర్చునొనే ప్రాంతం, మహిళల వార్డు మరీ ఇబ్బందికరంగా మారింది. కిటికీ అద్దాలు పగిలిపోయి ఉన్నాయి.

ఏడాదిగా డిప్యూటేషన్‌లో గైనకాలజిస్టు

స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గైనకాలజిస్ట్ ఏడాదిగా డిప్యూటేషన్‌పై నరసరావుపేట ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పెదకూరపాడు ఆస్పత్రిలో గైనకాలజిస్టు సేవలు పూర్తిస్థాయిలో అందక గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ప్రతి నెల 9వ తేదీన గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేస్తుంటారు. గతంలో సుమారు 70 నుంచి 80 మంది గర్భిణులు స్కానింగ్ కోసం ఆస్పత్రికి వచ్చేవారు. గైనకాలజిస్టు లేకపోవడంతో ఇప్పుడు స్కానింగ్‌కి వచ్చేవారి సంఖ్య 9 నుంచి 12 వరకు మాత్రమే నెల నమోదవుతుంది. గైనకాలజిస్టు అందుబాటులో లేక పోవటంతో గర్భిణులు కాన్పుల కోసం సత్తెనపల్లి, గుంటూరు వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

నియోజకవర్గ కేంద్రంలోని ప్రధానమైన ఏరియా ఆస్పత్రిని నూతన భవనాల్లోని పెండింగ్ పనులను పూర్తిచేసి, మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. అలాగే డిప్యూటేషన్‌పై వెళ్ళిన గైనకాలజిస్టును పెదకూరపాడు ప్రభుత్వ వైద్యశాలలో కొనసాగించే విధంగా చూడాలి. ఈ విషయాలపై స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దృష్టిసారించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

- మెగా ఇంజనీరింగ్ ప్రతినిధి భార్గవ్

ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించి ఇంకా బిల్లులు రావాల్సి ఉంది. బిల్లుల కోసం ఎదురుచూశాం. బిల్లులు చెల్లించకుంటే పనులు మొదలుపెట్టమని మా కాంట్రాక్టర్లు స్పష్టం చేశారు. దీంతో పనులు ఆగిపోయాయి.

గర్భిణుల ఓపీ పెరగాలంటే గైనకాలజిస్టు ఉండాలి

- డాక్టర్ మండా విద్య, ఆస్పత్రి సూపరింటెండెంట్



గర్భిణుల ఓపీ పెరగాలంటే గైనకాలజిస్టు ఉండాలి. గైనకాలజిస్టు లేక పోవటంతో పూర్తి స్థాయిలో సేవలు అందించ లేక పోతున్నాం. ఏడాది కాలంలో గైనకాలజిస్టు డిప్యూటేషన్‌లోనే ఉన్నారు.

ఎంఆర్‌పీకే విక్రయాలు

● సత్తెనపల్లి ఎక్సైజ్ సీఐ పీ.విజయ కుమార్

ఫటా ఫట్



ఎక్సైజ్ సీఐ విజయకుమార్

సత్తెనపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నూతన మద్యం పాలసీలో భాగంగా ఇటీవలే ప్రైవేట్ మద్యం షాపులు అందుబాటులోకి వచ్చాయి. ఐదు సంవత్సరాల క్రితం ఉన్న అన్ని బ్యాండ్‌లు దాదాపుగా వచ్చేశాయి. మద్యం దుకాణదారులు అమ్మకాల్లో సమయ పాలన పాటించాల్సి ఉంది. ఏవేని అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని, ఖచ్చితంగా ఎంఆర్‌పీ ధరలకే మద్యం అమ్మాలని సత్తెనపల్లి ఎక్సైజ్ సీఐ పీ విజయకుమార్ వెల్లడించారు. ఆయతో ఆంధ్రజ్యోతి 'ప్రతినిధి ఫటాఫట్ ..'

ప్ర: సత్తెనపల్లి సర్కిల్ పరిధిలో ఎన్ని మద్యం షాపులు ఉన్నాయి ?, ఎన్ని ప్రారంభమయ్యాయి?

జ: సత్తెనపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం మండలాల్లో 15 మద్యం షాపులు ఉన్నాయి. అన్నీ ప్రారంభమయ్యాయి.

ప్ర: రోజు ఎంత వ్యాపారం జరుగుతుంది?

జ: 15 షాపుల పరిధిలో రోజుకు రూ 20 నుంచి రూ. 25 లక్షల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి.

ప్ర: సమయ పాలన గురించి ?

జ : ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మద్యం షాపులు తెరవాలి. మద్యం షాపుల వద్ద ఎవరూ మద్యం తాగడానికి వీల్లేదు. అలా చేస్తే చర్యలు తీసుకుంటాం.

ప్ర: బెల్టు షాపులు మొదలయ్యాయా?

జ : ఇంకా షాపులకు పూర్తి స్థాయి లైసెన్స్ ఇవ్వలేదు. తాత్కాలిక లైసెన్స్ మాత్రమే ఇచ్చాం. అన్ని పూర్తయ్యాక షాపుల నిర్వాహణకు డోర్ నెంబరుతో సహా పర్మినెంట్‌గా లైసెన్స్ ఇస్తాం. ఈలోగా బెల్టు షాపులు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటాం.



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు బ్రహ్మనందరెడ్డి, శ్రీనివాసరావు, అరవిందబాబు

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు

దుర్గి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పులలో వేంచేసియున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారిని ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, యరపతినేని శ్రీనివాసరావు, చదలవాడ అరవిందబాబులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ శాశ్వత ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, ఈవో సైదమ్మ బాయిలు ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలికారు. వ్యాపారవేత్త వెన్నా శ్రీనివాసరెడ్డి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో ముందంజలో ఉండాలి

● మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

రెంటచింతల,అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదులో జిల్లాలోనే మాచర్ల నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉండాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. శుక్రవారం అమ్మవారి సన్నిధిలో రెంటచింతల నేతలతో మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై పార్టీ శ్రేణులు ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించి పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రతిరోజు రెండు గ్రామాల్లో పర్యటించి సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. సీఎంగా చంద్రబాబు అధికారం చేపట్టిన 100 రోజుల్లో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని అలాగే దీపావళి కానుకగా ఇచ్చే మూడు గ్యాస్ సిలిండర్ల గురించి అవగాహన కల్పించాలన్నారు.ఎమ్మెల్యేను కలిసిన వారిలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్‌రెడ్డి, బి.రామకృష్ణ, ప్రభురాజ్, సిద్దయ్య, ఇన్నారెడ్డి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన రైల్వే లైన్ నిర్మాణంతో

రాజధాని మరింత అభివృద్ధి

పెదకూరపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అమరావతి నూతన రైల్వే లైన్ నిర్మాణంతో అమరావతి రాజధాని ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజక వర్గ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ నూతన రైల్వే లైన్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపటం హర్షణీయమన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో నూతన రైల్వే లైన్ నిర్మాణంతో అమరావతికి మహర్దశ పడుతుందని, రూ 2,245 కోట్ల రూపాయలతో 57 కిలో మీటర్ల మేర రైల్వే లైన్ నిర్మాణం జరగనున్నట్టు తెలిపారు. కృష్ణా నది పై 3.2 కిలో మీటర్ల పర్యాటకులను ఆకర్షించేలా ఐకానిక్ రైల్వే లైన్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టడం శుభ పరిణామమని, ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు నిర్మించనున్న నూతన రైల్వే లైన్ రాజధానికి మణిహారంగా నిలవనుందన్నారు. రైల్వే లైన్ ఏర్పాటుతో అమరావతి రాజధాని నుంచి దేశంలోని ముఖ్య నగరాలకు రవాణా సౌకర్యం ఏర్పడుతుందన్నారు. నూతనంగా తొమ్మిది కొత్త రైల్వే స్టేషన్‌లు రావటంతో ఎర్రుపాలెం - నంబూరు మధ్య అన్ని ప్రాంతాలకు రైల్వే కనెటివిటీ ఏర్పాడటంతో పాటు వాహన రద్దీ తగ్గుతుందన్నారు. రైల్వే లైన్‌కు ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వానికి, రావటానికి కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు ప్రవీణ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

అచ్చంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీలక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్, తిరుమల ట్రేడర్స్, శివసాయి ట్రేడర్స్‌లోని ఎరువుల దుకాణాలను, గోడౌన్‌లను శుక్రవారం ఏడీఏ వీ హనుమంతరావు తనిఖీచేశారు. గోడౌన్ స్టాక్‌ను పరిశీలించి రిజిస్టర్‌లో నమోదు చేసిన స్టాక్‌తో పోల్చి చూశారు. ఎరువులను ఎమ్మార్పీకిమించి అమ్మరాదని, అలాఅమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రోజు స్టాక్ బోర్డును అప్‌డేట్ చేయాలని, ప్రతి రైతుకు కచ్చితంగా వారు కొనుగోలు చేసిన ఎరువులకు బిల్లులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో

స్పెషలాఫీసరు తనిఖీ

కారంపూడి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక మెయిన్ పాఠశాలను మండల స్పెషలాఫీసర్, డ్వామా పీడీ సిద్ధా లింగమూర్తి శుక్రవారం ఆకస్మిక తనిఖీచేశారు. విద్యార్థుల హాజరును తనిఖీ చేసి 23 మంది గైర్హాజరవడంపై ఉపాధ్యాయులను ప్రశ్నించారు. విద్యార్థులను స్కూల్‌కు సక్రమంగా తీసుకొచ్చే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం ఉర్దూ స్కూల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, గ్రామ కార్యదర్శి కనిన్యానాయక్, విద్యా కమిటి ఛైర్మన్ బాలునాయక్, సర్పంచ్ సరస్వతిబాయి పాల్గొన్నారు.

మద్యం దుకాణాల పరిశీలన

ముప్పాళ్ళ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ముప్పాళ్ళలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు మద్యం దుకాణాలను సత్తెనపల్లి ఎక్సైజ్ సీఐ పీ విజయ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలను ఏర్పాటు చేయాలని , నిబంధనలు అతిక్రమించిన వారి పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాలికల హస్టల్లో

న్యాయాధికారి తనిఖీ

పిడుగురాళ్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దార్ కార్యాలయం వెనుక వైపు వున్న బాలికల హాస్టల్‌ను శుక్రవారం పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి సత్యనారాయణ తనిఖీ చేశారు. ఈసందర్భంగా బాలికలకు అందిస్తున్న భోజన మెనును అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత, నాణ్యమైన భోజనం అందించ డంతో పాటు క్రమం తప్పకుండా వైద్యశిబి రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట సీఐ ఎస్ వెంకట్రావు, కోర్టు సిబ్బంది వున్నారు.

వైద్యసిబ్బందికి

షోకాజ్ నోటీసులు

దాచేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలోని అంజనాపురం కాలనీలో డయేరియా లక్షణాలతో 17 మంది అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలైన ఘటనలో దాచేపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు అమూల్య, అంజనాపురం ఎఎన్ఎం అరుణకు వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. జరిగిన సంఘటనపై సమాచారం ఎందుకు ఇవ్వలేదని అధికారులు నోటీసులో పేర్కొన్నారు.

సీఎంని కలిసిన

టీడీపీ నేతలు

సత్తెనపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును శనివారం నియోజకవర్గ టీడీపీ నేతలు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో కలసి సచివాలయంలో కలిశారు. నేతలను పేరుపేరునా కన్నా లక్ష్మీనారాయణ సీఎంకి పరిచయం చేశారు. చంద్రబాబుని కలిసిన వారిలో టీడీపీ రాష్ట్ర నేతలు నాగోతు శౌరయ్య, యేలినేడిరామస్వామి, చౌట శ్రీనివాసరావు, జిల్లా నేతలు గోగినేని కోటేశ్వరరావు, పూజల వెంకటకోటయ్యలు ఉన్నారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బోర్రా వెంకట అప్పారావును కూడా కన్నా చంద్రబాబునాయుడుకు పరిచయం చేశారు. వీరంతా పార్టీ విజయం కోసం ఎన్నికల్లో కష్టపడి పనిశారని కన్నా లక్ష్మీనారాయణ చంద్రబాబు నాయుడుకు వివరించారు. పార్టీ కోసం పనిచేసిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని చంద్రబాబునాయుడు తెలిపారు. వీరంతా విడివిడిగా చంద్రబాబునాయుడును శాలువాలతో పార్టీ కండువలతో ఘనంగా సత్కరించారు.

బుల్లెట్‌కు తగ్గని క్రేజ్





- విభిన్న రంగులు
- అధునాతన మోడళ్లు
- జిల్లాలో 70 వేలకు పైనే వినియోగం

వాహనాలెన్నొచ్చినా బుల్లెట్ పైనే యువత మోజు

గుంటూరు, సెప్టెంబరు 25: బుల్లెట్ వాహనం అంటేనే అదో క్రేజ్. మార్కెట్లోకి ఎన్ని ద్విచక్ర వాహనాలు వచ్చినా బుల్లెట్‌కు ఉండే హుందాతనమే వేరు. అందుకే యువత నుంచి నడి వయసు వారు సైతం బుల్లెట్‌పైనే ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల వీటి జోరు మరింత ఎక్కువవుతోంది. కళాశాలల్లో చదివే యువత నుంచి ఉద్యోగులు సైతం కొనుగోలు చేస్తూ డుగ్ డుగ్ సౌండ్స్‌తో దూసుకెళుతున్నారు. బుల్లెట్‌ల దిగ్గజ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ యువత నచ్చేలా విభిన్న రంగులు, మోడల్స్‌లో వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో 70వేలకు పైనే వీటి వినియోగం ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. బుల్లెట్‌లలో రూ. 2.12 లక్షల నుంచి రూ. 4.70ల వరకు ధరల్లో లభిస్తున్నాయి.

కొండలు, గుట్టలు ఎక్కడికైనా 'హిమాలయన్'

పెద్దవైన రాళ్ళు, కొండలు, గుట్టలపైనైనా తేలికగా డ్రైవ్ చేసుకొని ప్రయాణించేలా రాయల్ ఎన్‌ఫీల్డ్ వారు హిమాలయ వాహనాన్ని అందుబాటులోకి తెచ్చారు. 450 సీసీ ఇంజన్‌తో ఇది కొండలపైనైనా తేలికగా ప్రయాణించేలా రూపొందించారు.

లైట్ వెయిట్‌లో హంటర్

బుల్లెట్‌లో కూడా హంటర్ లైట్ వెయిట్ వంటి బరువు తక్కువగా ఉండే వాహనం కూడా అందుబాటులోకి వచ్చింది. ఇది కళాశాల స్థాయి యువతకు బరువు తక్కువగా ఉంటుంది. మరో వైపు క్లాసిక్ మోడల్‌లో సింగిల్ డిస్క్, డబుల్ డిస్క్ బ్రేక్‌ల కలిగిన బుల్లెట్ అందుబాటులో ఉంది. ఇవి కూడా 350 సీసీ ఇంజన్‌తో మద్రాస్‌రెడ్, జోధ్‌పూర్ బ్లూ, మిటాలియన్ కలర్‌తో పాటు ఏడు రంగుల్లో లభ్యమవుతున్నాయి.

నాలుగు రకాల్లో బుల్లెట్..

బుల్లెట్ ప్రారంభ మోడల్స్‌లో నాలుగు రకాల్లో అందుబాటులో ఉన్నాయి. వీటిలో 350 సీసీ ఇంజన్‌తో మిలటరీ, బ్లాక్, రెడ్ రంగుల్లో అందుబాటులో ఉన్నాయి. అంతేగాక మిలటరీ కలర్‌తో పాటు సిల్వర్, బ్లాక్, రెడ్‌లో కూడా ఉన్నాయి. స్టాండర్డ్ టైప్ బుల్లెట్‌లో బ్లాక్, మెరూన్, బ్లాక్, గోల్డ్ రంగులు లభిస్తున్నాయి. ఇవన్నీ రూ. 2.12 లక్షల నుంచి రూ. 2.39 లక్షల వరకు ధర చెబుతున్నారు.

మెయింట్‌నెన్స్ తక్కువే..
- బుల్లెట్ మెకానిక్ బాబు



ఇతర బైక్‌లతో పోల్చుకుంటే బుల్లెట్ మెయింట్‌నెన్స్ చాలా తక్కువగా ఉంటుంది. నేను 30 ఏళ్ళుగా బుల్లెట్ మెకానిక్‌గా పనిచేస్తున్నా. వాహనం నడిపే వారికి ఎంతో స్మూత్‌గా ఉంటుంది. మరో వైపు వాహన ప్రమాదాలు కూడా పెద్దగా జరగవు. యువతే కాదు నడి వయస్సు, పెద్ద వారు కూడా బుల్లెట్ నడిపేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొత్తగా వచ్చే వాహనాలు మైలేజ్ కూడా బాగానే ఇస్తున్నాయి. దాంతో ఎంతో మంది బుల్లెట్‌నే కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. పైగా బుల్లెట్ నుంచి సౌండ్ అన్ని వాహనాల కన్నా ఓ రేంజ్‌లో ఉంటుంది. అందుకే అందరూ ఇష్టపడుతుంటారు.

40 ఏళ్ళుగా బుల్లెట్ నడుపుతున్నా...
- ధూళిపాళ్ళ వెంకటేశ్వరరావు



నేను 40 ఏళ్ళుగా బుల్లెట్ నడుపుతున్నా. రాయల్టీకి కేరాఫ్‌గా బుల్లెట్ ఉంటుంది. రూ. లక్షలు పోసి కారు కొన్నా బుల్లెట్ పై తిరిగిన అనుభూతి, రాయల్టీ మరో వాహనానికి రాదు. బుల్లెట్ నుంచి వచ్చే బీట్ సౌండ్ మరే వాహనానికి రాదు. హుందా తనం ఉట్టిపడేలా ఉంటుంది. ప్రమాదాలు కూడా పెద్దగా జరగవు. ఒక వేళ వాహనం కింద పడినా చిన్నా చితకా గాయాలు తప్ప ప్రాణహాని జరగదు.



డబుల్ సైలెన్సర్‌లతో ఇంటర్ సెప్టార్

ఎంతో స్టైలిష్‌గా ఉండే ఇంటర్ సెప్టార్‌కు డబుల్ సైలెన్సర్ ప్రత్యేకత. రెండు సైలెన్సర్‌లతో డుగ్ డుగ్ అంటూ రహదారిపై మోత పుట్టిస్తుంది. 650 సీసీ ఇంజన్ పవర్‌తో దూసుకెళుతుంది. ఇదే కోవలో కాంటి నెంటల్ జీటీ యూత్‌ను మరింత ఆకట్టు కుంటుంది. మొత్తం ఆరు రంగుల్లో అందుబాటులో ఉన్నాయి. సూపర్ మీటియో పేరుతో మరో బుల్లెట్ క్రూజ్ మోడల్లో అందుబాటులోకి వచ్చింది.

ఇరుకు రోడ్లలోనైనా రైడ్ చేసే షార్ట్ గన్

ఇరుకు రోడ్లలోనైనా, సందులు, గొందుల్లోనైనా సరే సులభంగా డ్రైవ్ చేసేలా 'షార్ట్ గన్' మోడల్‌ను అందుబాటులోకి తెచ్చారు. 650 సీసీ పవర్ ఇంజన్‌తో ఇది నాలుగు రంగుల్లో లభ్యమవుతుంది. ఇక ఇది ప్రారంభ ధర రూ. 4.35 లక్షల నుంచి రూ. 4.51 లక్షల వరకు ధరగా నిర్ణయించారు.



విభిన్న రంగుల్లో గరిల్లా బుల్లెట్

- **లాంగ్ డ్రైవ్‌కు మిటియో క్రూజర్**
  ఎవరైనా దూర ప్రాంతాలకు తేలిక అతి కొద్ది సమయంలోనే దూసుకెళ్ళాలనుకునే వారికి బుల్లెట్‌లో మిటియో క్రూజర్ బుల్లెట్ అందుబాటులో ఉంది. ఇది ఎంత దూరం డ్రైవ్ చేసినా ఎటువంటి బ్యాక్ పెయిన్ రాదని నిర్వాహకులు చెబుతున్నారు.
- **గ్రామస్థాయిలో రోడ్లపై డ్రైవ్‌కు స్క్రామ్**
  చిన్న పాటి సందు గొందులతో పాటు గ్రామ స్థాయిలో రోడ్లలో నడిపేందుకు వీలుగా 'స్క్రామ్'బుల్లెట్ అందుబాటులో ఉంది. దీంతో ఎటువంటి రహదారుల్లోనైనా ప్రయాణించినా అలసట లేకుండా సౌకర్యంగా ఉంటుంది.
- **మంచి స్టైలిష్‌గా గరిల్లా**
  వాహనం చూస్తానికి చిన్నదే అయినా యూత్ నచ్చే స్టైలిష్‌గా ఉండే దే గరిల్లా మోడల్. 450 సీసీ ఇంజన్ పవర్‌తో యువత ఇట్టే దూసుకుపోయేలా అందుబాటులోకి తెచ్చారు. దీనిపై ఇటీవల యువత కొనుగోలు చేసేందుకు మోజు చూపుతున్నారు.



కేంద్ర మంత్రి షెకవత్ నుంచి బహుమతిని అందుకుంటున్న ఎస్ఆర్ఎం విద్యార్థులు

జాతీయ స్థాయి షార్ట్‌ఫిల్మ్ పోటీల్లో

ఎస్ఆర్ఎంకు ద్వితీయ బహుమతి

మంగళగిరి సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ జాతీయస్థాయిలో నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ పోటీల్లో ఏపీ ఎస్ఆర్ఎం విద్యార్థులు ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. ఎస్ఆర్ఎంకు చెందిన సినీమేట్స్ క్లబ్‌లో సభ్యులైన ఇంజనీరింగ్ విద్యార్థులు దుర్వాసుల షణ్ముఖ శివ దుర్గేశ్, షేక్ తహీర్, ఆవుల శివ ప్రకృతి విపత్తులు, భవిష్యత్ తరాలకు కల్పించాల్సిన రక్షణ అనే అంశంపై రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌ను జాతీయ స్థాయి పోటీలకు పంపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి అందిన మొత్తం 74ఎంట్రీలను పరిశీలించిన న్యాయ నిపుణులు ఎస్ఆర్ ఎం విద్యార్థులు నిర్మించిన 'ఆఫ్టర్ షాక్' అనే షార్ట్ ఫిల్మ్‌కు ద్వితీయ బహుమతిని ప్రకటించారు. న్యూఢిల్లీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటరులో ఈ నెల 23న జరిగిన కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాలు, రూ.లక్షా 50 వేల నగదు బహుమతిని అందుకున్నారు.

మిర్చియార్డులో మళ్లీ ఐఏఎస్ పాలన

- కొత్త పాలకవర్గం నియామకంలో ప్రభుత్వ జాప్యం
- అప్పటి వరకు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ భార్గవతేజ
- రాజమండ్రి ఏఎంసీ కార్యదర్శి ఆంజనేయులుకు పూర్తి అదనపు బాధ్యతలు
- ఐవీ రెడ్డిని మార్కెటింగ్ శాఖలో రిపోర్టు చేయాలని ఆదేశం



ఆంజనేయులు

గుంటూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు (గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ)లో తిరిగి ఐఏఎస్ అధికారి పాలనకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త కమిటీ కూర్పులో జాప్యం జరుగుతుండటంతో మార్కెటింగ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఈ నిర్ణయాన్ని తీసుకొన్నారు. మార్కెటింగ్ డైరెక్టర్ అంద జేసిన నివేదిక ఆధారంగా జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవ తేజని గుంటూరు ఏఎంసీ పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ శుక్ర వారం స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనేపథ్యంలో శనివారం జేసీ భార్గవతేజ మిర్చియార్డులో బాధ్యతలు చేపడతారని అధికారవర్గాలు తెలిపాయి.

వైసీపీ ప్రభుత్వ హయాంలోజరిగిన అవినీతి, అక్రమాలపై మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మిర్చియార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు ఫిర్యాదు మేరకు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దర్యాప్తు జరుపుతున్న విషయం తెలిసిందే. మరోవైపు మార్కెటింగ్ శాఖ స్వీయ విచారణని కూడా ప్రారంభించింది. మార్కెటింగ్ జేడీ విజయవాడ రీజియన్ కాకుమాను శ్రీనివాసరావు నేతృత్వంలో 11 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరుపుతున్నది. ఈ నేపథ్యంలో తాను యార్డు పర్సన్ ఇన్‌చార్జిగా ఉండటం సరికాదని, తన బాధ్యతలు తీసేయాలని జేడీ శ్రీనివాసరావు కమిషనర్‌కు లేఖ రాశారు. ఈ విషయాన్ని కమిషనర్ మార్కెటింగ్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీకి నివేదించారు. దాంతో ఆయన జాయింట్ కలెక్టర్ భార్గవ తేజని పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇంచుమించు దశాబ్దం తర్వాత..

మిర్చియార్డులో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐఏఎస్ పరి పాలన కొన్ని నెలల పాటు సాగింది. జాయింట్ కలెక్టర్‌గా చెరుకూరి శ్రీధర్ ఉన్న సమయంలో మూడు, నాలుగు నెలల పాటు ఆయన పర్సన్ ఇన్‌చార్జ్‌గా కొనసాగారు. ఆ తర్వాత పాలకవర్గాలు ఏర్పాటు అయ్యాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా పాలకవర్గాలను నియమించడం వలన పర్సన్ ఇన్‌చార్జి అవసరం రాలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత కమిటీలను రాజీనామా చేయించింది. ఇంచుమించు నాలుగు నెల లుగా జేడీని పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమించి పరిపాలనకు ఇబ్బంది లేకుండా చూస్తున్నది. ఇపుడు జేసీని నియమించడంతో యార్డులో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు చేపట్టింది.

మరోవైపు మిర్చియార్డు ప్రస్తుత ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డిని మార్కెటింగ్ స్పెషల్ సీఎస్ తొలగించారు. ఆయన్ని హెడ్ ఆఫీసులో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. వెంకటేశ్వర రెడ్డి స్థానంలో రాజమండ్రి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వీ ఆంజనేయులుని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంజనేయులు గతంలో గుంటూరు ఏఎంసీలో కొంతకాలం విధులు నిర్వహించిన అనుభవం ఉన్నది. కాగా ఆయను ఏడాదిలోపు పదవీ విరమణ కానున్నారు.



ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావుతో సమావేశమైన ఎన్ఐఆర్ఎఫ్ ఎక్స్‌ఫర్ట్ కమిటీ సభ్యులు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో

ఎన్ఐఆర్ఎఫ్ ఎక్స్‌ఫర్ట్ కమిటీ పర్యటన

- ప్రిన్సిపాల్స్ , అకడమిక్ డీన్లు, అధికారులతో కమిటీ సభ్యుల బృందం సమావేశం

పెదకాకాని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎన్ఐఆర్ఎఫ్ ఎక్స్‌ఫర్ట్ కమిటీ పర్యటన శుక్రవారం ప్రారంభమైంది. ఈకమిటీలో న్యూఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ హనరరీ డైరెక్టర్ ప్రొఫెసర్ జుబేదా అన్సారి, హైదరాబాదులోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ పూర్వ సీనియర్ నాక్ అడ్వైజర్ డాక్టర్ రమా కొండపల్లి, కోయంబత్తూర్‌లోని అమృత విశ్వ విద్యాపీఠం ఐక్యూ ఏసీ విభాగాధిపతి డాక్టర్. ప్రశాంత్ ఆర్. నాయర్‌ల బృందం వర్సిటీలో పర్యటించారు. ముందుగా కమిటీ సభ్యులకు ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య కే. గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలంలు సాదర స్వాగతం పలికారు. అనంతరం కమిటీ సమావేశ మందిరంలో యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ , అకడమిక్ డీన్లు, అధికారులతో కమిటీ సభ్యుల బృందం సమావేశమైంది. ఈ సమావేశంలో వర్సిటీ ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణసత్య , ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపికృష్ణ, వర్సిటీ ర్యాంకింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. రవి తదితరులు యూనివర్సిటీ నివేదికను కమిటీ సభ్యులకు వివరించారు. అందులో అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్, ఇన్నోవేషన్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ సెల్, సోలార్ సిస్టం, బ్యాటరీ వెహికల్,సేంద్రియ వ్యవసాయం, బొటానికల్ గార్డెన్, కమ్యూనిటీ రేడియో, యూనివర్సిటీ ముద్రిస్తున్న జర్నల్స్, ఇప్పటివరకు యూనివర్సిటీ సాధించిన అంతర్జాతీయ, జాతీయ, ర్యాంకులు, గేట్ , ఐఏఎస్, యూజీసీ నెట్ కోర్సులకు ఉచితంగా అందిస్తున్న శిక్షణ వివరాలను వెల్లడించారు. గడచిన కొద్ది నెలల క్రితం వర్సిటీలో నాక్ బృందం పర్యటించి వర్సిటీకి ఏ ప్లస్ గ్రేడ్ ను అందించింది. అలాగే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్‌లో యూనివర్సిటీకి ఓవరాల్ ర్యాంకింగ్‌లో 97వ స్థానం, యూనివర్సిటీల కేటగిరిలో 59వ స్థానం, స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీ కేటగిరీలో 20వ స్థానం వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య కే. గంగాధరరావు మాట్లాడుతూ దినదినాభివృద్ధి చెందుతున్న విశ్వవిద్యాలయం మరింత పురోగతి సాధించేందుకు ఎన్ఐఆర్ఎఫ్ 20వ ర్యాంకు నుంచి పదవ ర్యాంకు పొందేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి కమిటీ సభ్యులు సూచనలు చేయాలని కోరారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ జాతీయస్థాయిలో పేటెంట్ హక్కులు పొందేందుకు అధ్యాపకులు చేస్తున్న కృషి, జాతీయ సంస్థలు అందిస్తున్న వివిధ ప్రాజెక్టులను అధ్యాపకులు అందిపుచ్చుకోవాలని సూచించారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, డీన్లు ఆచార్య త్రిమూర్తి రావు, పాల్ కుమార్, రవికుమార్, ప్రిన్సిపాల్స్ ఆచార్య స్వరూప రాణి, ఆచార్య వీరయ్య, ఆచార్య ప్రమీల రాణి ,ఆచార్య సిద్దయ్య, ఆచార్య నిరూపమా, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి వెంకటేశ్వర్లు, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుధాకర్, ఐక్యూఏ సి మాజీ డైరెక్టర్ ఆచార్య సంధ్యకోలే తదితరులు పాల్గొన్నారు.

73.72 లక్షల విలువైన విదేశీ సిగరెట్లు ధ్వంసం

గుంటూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్మగ్లింగ్ కేసుల్లో పట్టుబడిన రూ 73.71 లక్షల విలువ చేసే విదేశీ సిగరెట్లను ధ్వంసం చేసినట్లు ఏపీ కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లా, యడ్లపాడు మండలంలోని జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ లో సిగరెట్లను కాల్చి బూడిద చేసే కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ కస్టమ్స్ అధికారులు పట్టుకున్న విదేశీ సిగరెట్లను స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ వారి సహకారంతో సిగరెట్‌లను ధ్వంసం చే శామని, అన్ని అనుమతులతో, పర్యావరణానికి హాని కలగకుండా కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. ధ్వంసం చేసిన వాటిలో పారిస్, దరమ్ బ్లాక్ వంటి వివిధ చౌకబారు బ్రాండ్ సిగరెట్లు ఉన్నాయన్నారు. కస్టమ్స్ చట్టం లోని నిబంధనలకు విరుద్ధంగా ఈ సిగరెట్లు భారత్ దేశంలోకి అక్రమంగా దిగుమతి చేసినట్లు గుర్తించామన్నారు. ఈ స్మగుల్డ్ సిగరెట్లు మార్కెట్ లో విక్రయించడం చట్టరీత్యా నేరమని కమిషనర్ వెల్లడించారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే నాసిరకంతో కూడుకున్న ఇటువంటి సిగరెట్లు అక్రమ రవాణాపై చర్యలు చేపడతామన్నారు. ఇలాంటి పన్ను చెల్లించని ఎన్నో బ్రాండ్ల విదేశీ సిగరెట్లు పలు అక్రమ మార్గాలలో మన దేశంలోకి చొరబడుతున్నాయని, వీటిని ఎవరైనా విక్రయించినా, సరఫరా చేసినా భారీ పెనాల్టీ విధించటంతో పాటు, జైలుకు కూడా పంపిస్తామని ఆయన హెచ్చరించారు. సిగరెట్లు ధ్వంసం కార్యక్రమంలో డిఆర్ఐ, డీసీ సాహస సూర్య, కస్టమ్స్ ఏసీ అబ్దుల్ అజీమ్, కస్టమ్స్ సూపరింటెండెంట్లు కిషోర్, వివేక్, వేణుగోపాల్, నందిపాటి శ్రీనివాస్ చౌదరి ఇతర అధికారులు పాల్గొన్నారు.



విదేశీ సిగరెట్లను ధ్వంసం చేస్తున్న సిబ్బంది



ఇది సెల్ఫీ టైం..

యువకుడి క్లే ఆర్ట్

సందడి చేస్తున్న యువత

యువజన సంబరం

- కేరింతల మధ్య సంబరాలు
- నేటితో ముగియనున్న యువజనోత్సవాలు



పెదకాకాని, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): యువత విద్యలో మాత్రమే కాదు కళా రంగంలోనూ తమకు ప్రావీణ్యం ఉందని నిరూపించేందుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా నిలిచింది. యువ దినోత్సవంలో భాగంగా రెండవ రోజు శుక్రవారం ఉత్సాహంగా ఉల్లాసంగా విద్యార్థుల ప్రదర్శనలు సాగాయి. అబ్బురు పరిచే డాన్సులతో, విన్యాసాలతో మరోసారి కళాకారులుగా మారారు. స్కిట్ మైము ప్రదర్శనలపే విద్యార్థులు ఎంతో కష్టపడి చేశారు. విచిత్ర వేషధారణలతో, ఆకట్టుకునే విన్యాసాలతో గత కాలాన్ని గుర్తుచేసే సాంప్రదాయ పద్ధతిలో స్కిట్ లు చేశారు. మ్యూజిక్ విభాగంలో క్లాసికల్ వోకల్ సోలో (హిందుస్తానీ, కర్ణాటక), లైట్ ఓకల్ సోలో, గ్రూప్ సాంగ్స్, డిబేట్, క్విజ్ పోటీలు, ఫైనాన్స్ విభాగంలో కొల్లేజ్, క్లే మోడలింగ్, మెహందీ పోటీలలో మంచి ప్రదర్శనలు చేశారు. యువజన ఉత్సవాల నిర్వహణను కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళి మోహన్, అడిషనల్ కోఆర్డినేటర్ ఆచార్య పి జాన్సన్ పర్యవేక్షించారు.

నేటితో ముగింపు ..

మూడు రోజుల యువజన ఉత్సవాలు శనివారంతో ముగుస్తాయని కోఆర్డినేటర్ ఆచారి మురళి మోహన్ తెలిపారు. చివరి రోజు ఫోక్ ట్రైబల్ డాన్స్, స్కిట్స్ ఎలక్యూషన్ రంగోలి కార్ట్ బోనింగ్, స్పాట్ ఫోటోగ్రఫీ వంటి పోటీలను నిర్వహించనున్నారు.

విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ప్రత్యేక అతిధులుగా బిగ్ బాస్ ఫేమ్, హీరో సయ్యద్ సోహెల్ ర్యాన్, బిగ్ బాస్ ఫేమ్ శ్రీసత్య లు పాల్గొంటారని మురళీ మోహన్ తెలిపారు



డాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కారవేదిక

నరసరావుపేట టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా నాలుగో శనివారం ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పీ అరుణబాబు శుక్రవారం తెలిపారు. దీనిలో భాగంగా శనివారం ప్రత్యేక పరిష్కారవేదిక నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10గంటలకు కలెక్టరేట్‌లో జరిగే షెడ్యూల్డు తెగల ప్రజలు ప్రత్యేక పరిష్కార వేదికను వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు.

క్రైమ్ జోన్

పదకొండు మంది జూదరుల అరెస్టు

యడ్లపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుచోలలో గురువారం రాత్రి పోలీసులు ఓ పేకాట స్థావరంపై దాడి చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కారుచోలలో పేకాడుతున్న సమాచారంతో సిబ్బందితో కలసి దాడులు చేశామన్నారు. గ్రామంలోని ఓ ఇంటిలో పేకాడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ. 32,590లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. వారందరిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

రొంపిచర్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్ల మార్కెట్ యార్డు వద్ద రోడ్డు ప్రమాదం జరిగి ఒకరు మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునమాక గ్రామానికి చెందిన పలుకూరి శ్రీనివాసరావు (46) రొంపిచర్లలో టైలరింగ్ పనులు చేస్తుంటాడు. పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై గ్రామానికి వెళ్తుండగా మార్కెట్ యార్డు హైవే వద్ద కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ అశోక్ పరిశీలించారు. అశోక్‌కు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

వినుకొండ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) కోడి పందేల స్థావరాలపై పోలీసులు దాడిచేసిన సంఘటన మండలంలోని దొండపాడు చెరువు వద్ద శుక్రవారం జరిగింది. పట్టణ సీఐ శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం దొండపాడు చెరువు వద్ద కోళ్ళ పందేల స్థావరాలపె ఎస్ఐ హామీర్ భాషాతో కలిసి దాడులు చేశామని తెలిపారు. దాడుల్లో నాలుగు పందెం కోళ్లు, 20 ద్విచక్రవాహనాలు, ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ 16750 రూపాయలను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఆక్రమణలు తొలగించాలి

మునిసిపల్ కమిషనర్‌కు టీడీపీ వినతి

నరసరావుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బార్.. రెస్టారెంట్‌ల ఎదుట రోడ్డు అక్రమణలు తొలగించాలని టీడీపీ నేతలు కోరారు. ఈ మేరకు మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. నవయుగ, శ్రీనివాస, ఆర్‌కే, జీవన్‌జ్యోతి బార్ నిర్వాహకులు రోడ్డును అక్రమించి నిర్మాణాలు చేపట్టడం వలన ట్రాఫిక్ ఇబ్బందులు నెలకొంటున్నాయని పేర్కొన్నారు. బార్‌లను తనిఖీచేసి అక్రమ కట్టడాలను తొలగించాలని టీడీపీ నేతలు తాండవకృష్ణ తదితరులు డిమాండ్ చేశారు.

27న గుంటూరులో మాస్టర్ స్టేట్ స్విమ్మింగ్ పోటీలు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈ నెల 27న ఐదవ మాస్టర్ స్టేట్ స్విమింగ్ పోటీలు జరుగుతాయని పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం తెలిపారు. వివిధ కేటగిరీలలో పురుషులు, మహిళలకు పోటీలు ఉంటాయన్నారు. అదనపు సమాచారం కోసం 829 6374963 నంబరును సంప్రదించాలన్నారు.

హైస్కూల్‌ను పరిశీలించిన అధికారులు

ఈపూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ హైస్కూల్‌ను ఎంపీడీవో కే ప్రభాకరరావు శుక్రవారం పరిశీలించారు. వర్షం పడితే పాఠశాల తరగతి గదులలోకి నీరు వచ్చి చేరుతుందని ఉపాధ్యాయులు ఫిర్యాదు చేయడంతో ఎంపీడీవో పరిశీలించారు. డ్రెయిన్స్‌లో మురుగు తొలగిస్తే సమస్య తీరుతుందని ఆయనతోపాటు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావర్ల జగ్గారావు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ హనుమంతురావు, ఊట్ల పాపారావు డీ సురేష్, ఎస్ సురేష్ ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

యడ్లపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. మండలంలోని బోయపాలెం పరిధిలోని అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఈ పోటీలలో 9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర, పరిసరాల పరిరక్షణలో పోలీసులకు ఎదురయ్యే ఇబ్బందులు అనే అంశాలపై పోటీలను నిర్వహించారు. సుమారు120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్ఐ బాలకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

చెట్ల పెంపకంపై అవగాహన ర్యాలీ

కారుచోల (యడ్లపాడు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుచోలలో అటవీయేతర భూముల్లో చెట్ల పెంపకంపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా రైతులకు ఆగ్రో ఫారెస్ట్రీ, ఉద్యాన మొక్కలు, అడవి జాతి మొక్కలు వ్యవసాయభూమిలో నాటితే వచ్చే ప్రయోజనాలు, ఆదాయం గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ట్రీస్ అవుట్‌సైడ్ ఇండియా ప్రోగ్రాం సీసీ సి వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో వీపీఏ హనుమంతరావు, వీహెచ్‌ఏ వినయ్‌కుమార్, బాలయ్య, సీసీ అనిల్, మణికంఠ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పోట్లూరులో లోపించిన పారిశుధ్యం

- గ్రామంలో కొరవడిన మౌలిక వసతులు
- సర్పంచ్ నిర్లక్ష్యంతో కుంటుబడుతున్న గ్రామాభివృద్ధి
- ఇబ్బందులుపడుతున్న గ్రామస్థులు



పోట్లూరులో రోడ్లవెంబడి వేస్తున్న చెత, వ్యర్థాలు

పోట్లూరు (శావల్యాపురం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోట్లూరులో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. అభివృద్ధి చతికిలపడింది. సర్పంచ్ నిర్లక్ష్యం కారణంగా గ్రామపాలన పూర్తిస్థాయిలో నిలిచిపోయింది. ప్రజాక్షేత్రంలో ప్రజల మద్దతుతో గెలిచి గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి పథంలో నడిపించాల్సిన సర్పంచ్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీంతో గ్రామంలో మౌలిక వసతులు కరువై అభివృద్ధికి నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోట్లూరులో గ్రామపాలన పూర్తి స్థాయిలో కుంటుపడింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామంలో అభివృద్ధి పథకాలన్నీ నిర్వీర్యంగా మారాయి. గత ఎన్నికల్లో వైసీపీ తరపున సర్పంచ్‌గా గెలిచిన మహిళ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామపాలనను పూర్తిగా విస్మరించింది. నాలుగునెలలుగా గ్రామంలో ఇంటింటికీ చెత్తసేకరణ కూడా నిలిపివేయడంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. గత్యంతరం లేక ఇళ్లలోని చెత్తను గ్రామస్థులు ఊరికి పక్కనున్న పొలాల్లో, రోడ్ల వెంబడి పడేస్తున్నారు. గ్రామంలోని మురికికాలువల్లో పూడికతీసి మూడేళ్ళు అవుతున్న ఇటు సర్పంచ్ గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో దోమలకు నిలయాలుగా మారాయి. దోమల ధాటికి గ్రామస్థులు విషజ్వరాలబారిన పడుతున్నారు. రాత్రివేళల్లో గ్రామంలో వీధిలైట్లు వెలగకపోవడంతో బయటకు వెళ్లాలంటే మహిళలు, పిల్లలు భయపడే పరిస్థితి నెలకొంది. గ్రామంలో హిందూ శ్మశానవాటికకు ఐదేళ్లుగా కనీస మరమ్మతులు చేయకపోవడంతో మౌలిక వసతులు కరువయ్యాయి. శ్మశానవాటిక చుట్టూ గోడలు కూడా లేవు. శ్మశానవాటికకు వెళ్లే రోడ్డుకిరువైపులా పిచ్చి చెట్లు పెరిగిపోవడంతో అంత్యక్రియలకు వెళ్లేందుకు గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. పొలాకెళ్లే రోడ్ల పక్కన పిచ్చిచెట్లు కొట్టించకపోవడంతో కొమ్మలు రోడ్లపైకి పాకి పొలాలకు వెళ్లే రైతులకు ఇబ్బందికరంగా మారింది. మండలంలోని పెద్ద గ్రామాల్లో ఒకటైన పోట్లూరుకు గత ఐదేళ్లలో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించకుండా ఇన్‌చార్జిలతో కాలం గడుపుతున్నారు. ఇన్‌చార్జిలుగా నియమించబడిన కార్యదర్శులు నెలకోసారి కూడా గ్రామానికి వస్తున్న దాఖలాలు లేవు. పనులుంటే ప్రజలే వారి వద్దకు వెళ్లి చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామంలోని ఊరిచెరువుకు వేలం నిర్వహించి రెండున్నరేళ్లయినా గుత్తేదారు ఇంతవరకు నగదు చెల్లించలేదు. నగదు వసూలు చేయాల్సిన పంచాయతీ కార్యదర్శులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో గ్రామానికి రావాల్సిన ఆదాయవనరులు దెబ్బతిన్నాయి. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పోట్లూరులో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



పోట్లూరులో నిరుపయోగంగా ఉన్న చెత్త సేకరణ కేంద్రం

నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా విక్రయిస్తే కఠినచర్యలు

● ఎస్పీ కంచి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కే శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు హెచ్చరించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిబందనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచిన వారిపై పేలుడు పదార్థాల చట్టం, ఐపీసీ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదాలకు తావులేకుండా సరైన భద్రత ప్రమాణాలు పాటించాలని బాణసంచా విక్రయదారులకు సూచించారు. నీరు, ఇసుక తదితర అగ్నిమాపక నిరోధక సామగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ కేంద్రాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆ పరిసరాల్లో ఏం చేయాలో చేయకూడదో తగు సూచనలతో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. చిన్న పిల్లలను బాణసంచా విక్రయ దుకాణాల్లో ఉంచకూడదన్నారు. లైసెన్స్‌లు దుకాణాల్లో మాత్రమే విక్రయాలు చేయాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా వెంటనే ఎస్పీకి గాని, సంబంధిత పోలీసు స్టేషన్‌కు గాని సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ఘనోరే, బాణసంచా విక్రేతలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు: ఈడీ వెంకటేశ్వరరావు

చిలకలూరిపేట అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించటానికి ఏపీఎస్ ఆర్టీసీ సిద్ధంగా ఉందని ఆ సంస్థ ఈడీ వెంకటేశ్వరరావు చెప్పారు. శుక్రవారం ఆయన చిలకలూరిపేటలో విస్తృతంగా పర్యటించారు. చిలకలూరిపేట నుంచి విజయవాడ వెళ్ళే బస్సులో ప్రయాణించి ప్రయాణికుల సమస్యలను తెలుసుకున్నారు. బస్టాండ్ ప్రాంగణంలో సౌకర్యాలు, సమస్యల గురించి ఆరా తీశారు. కళా మందిర్ సెంటర్‌లో పర్యటించి ఆర్టీసీ ప్రయాణికుల నుంచి సూచనలు, సలహాలు తెలుసుకున్నారు. చిలకలూరిపేటలో అత్యధికమంది ప్రయాణికులు కళామందిర్ సెంటర్ నుంచి ప్రయాణిస్తున్నారని, వారు విజయవాడకు మరిన్ని సర్వీసులు పెంచాలని కోరారని, విషయంపై అధికారులతో మాట్లాడానన్నారు. ఆర్టీసీ ప్రవేశపెట్టిన కార్గో సర్వీసులను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని, సేవలను మరింతగా పెంచాలన్నారు. ప్రయాణికులు తమ సమస్యలను టోల్‌ఫ్రీ నెంబరు 149కు ఫోన్‌చేసి తెలియజేయాలని కోరారు.



వడ్డెంగుంటలో అక్రమంగా మట్టిని తవ్వుతున్న ప్రొక్లెయిన్

వడ్డెంగుంటలో అక్రమంగా మట్టి తవ్వకం

బొల్లాపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డెంగుంటలోని ప్రభుత్వ పోరంబోకు భూమిలో ఎటువంటి అనుమతుల్లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన గోనుగుంట్ల పెదసోమయ్య అనే రైతు ఎటువంటి అనుమతులు లేకుండా టిప్పర్లతో భారీఎత్తున మట్టిని వినుకొండకు తరలిస్తున్నాడు. దీనిపై గ్రామస్తులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేయటంతో అధికారులు మట్టి తవ్వకాన్ని నిలుపుదల చేశారు. దీనిపై తహసీల్దార్ ఏ సుధాకర్‌ను వివరణ కోరగా మట్టి విక్రయిస్తున్న రైతుపై పోలీసులకు ఫిర్యాదు చేసి మట్టి రవాణాను అడ్డుకున్నామన్నారు.

రైతు సేవా కేంద్రం సిబ్బంది చొరవ చూపాలి

● జిల్లా వ్యవసాయశాఖ శిక్షణ కో ఆర్డినేటర్ శివకుమారి

వినుకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఆర్థిక నష్ట నివారణపై రైతు సేవా కేంద్ర సిబ్బంది చొరవ చూపాలని జిల్లా వ్యవసాయశాఖ శిక్షణ కో ఆర్డినేటర్ ఎం.శివకుమారి తెలిపారు. స్థానిక కీర్తిహాల్ సమీపంలోని ఫర్టిలైజర్స్ అసోసియేషన్ బిల్డింగ్ లో నియోజకవర్గంలోని రైతు సేవా కేంద్ర సిబ్బందికి నైపుణ్య పెంపుదలపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.శివకుమారి మాట్లాడుతూ రైతులకు అవసరమైన సలహాలు సూచనలు అందించి, పంటలకు వ్యాపించే తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ బోయపాటి రవిబాబు, ఏవో అంజిరెడ్డి పాటు వివిధ మండలాలకు చెందిన వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు జొన్నలగడ్డ విద్యార్థుల ఎంపిక



సైక్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 25: రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు మండలంలోని జొన్నలగడ్డ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 24న నాదెండ్ల మండలం గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎంపికల్లో అండర్ -14 విభాగంలో ఎన్.లావణ్య, అండర్ -17 విభాగంలో ఎం.బిందు పూర్ణిమ, జె.రెబ్కారాణి, ఎం.శశి కుమార్, అండర్-19 విభాగంలో బి.విజయలక్ష్మి, జె.దేవప్రసన్నకుమార్, పి.జతిన్‌లు ఎంపికయ్యారు. విద్యార్థులను, పీఈటీ ఐ.సునీల్‌లను పాఠశాల సిబ్బంది అభినందించారు. కాగా ఈ నెల 26, 27, 28 తేదీలలో ఎన్టీఆర్ జిల్లా నున్నలో జరిగే పోటీలలో వీరు పాల్గొంటారు.

డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన

నరసరావుపేట టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీటీ అండ్ ఎస్‌వీసీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో నరసరావుపేట రూరల్ ఎస్ఐ ప్రియాంక పాల్గొని మాట్లాడుతూ మాదక ద్రవ్యరహిత సమాజమే నేటి యువత ముందున్న కర్తవ్యం అని అన్నారు. డ్రగ్స్ వినియోగం జీవితాలను సర్వనాశనం చేస్తుందని వివరించారు. డ్రగ్స్ అమ్మిన వారికి కఠిన శిక్షలుంటాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాకాని సుధాకర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్ శ్రీనివాసరావు, డాక్టర్ దీప, డాక్టర్ నయామ్, పీ సునీల్, విద్యార్థులు పాల్గొన్నారు.

నాలుగు నెలల్లో ఏడు డయేరియా మరణాలు

● గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆరోపణ

నరసరావుపేట టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గంలో నాలుగు నెలలో ఏడు డయేరియా మరణాలు సంభవించాయని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆరోపణలు చేశారు. శుక్రవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ కలుషిత నీరు తాగి ప్రాణాలు కోల్పోతున్నారని, కౌన్సిలర్లు ఫిర్యాదులు చేసినా కమిషనర్ పట్టించుకోలేదని, డయేరియా మృతుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దోచుకుందాం, దాచుకుందా, అనే యావ తప్ప ప్రజారోగ్యం గురించి పట్టించుకునే తీరిక ఈ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో ఏనాడూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకోలేదన్నారు. డయేరియా బాధిత కుటుంబాలను ఆదుకోకపోతే ప్రజల పక్షాన నిలబడి పోరాడతామని కాసు మహేష్‌రెడ్డి హెచ్చరించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని సారించాలి

● మండల విద్యాశాఖాధికారి సాంబశివరావు

తుమ్మలకుంట (శావల్యాపురం) అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిని సారించాలని, వారికి ఉత్తమ విద్యాబోధనను అందించి వారిలోని విద్యాసామర్థ్యాలు పెంచాలని మండల విద్యాశాఖాధికారి మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. మండలంలోని కొత్తలూరు పంచాయతీ పరిధిలోని తుమ్మలకుంటలో ప్రాథమిక పాఠశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల బోధనా ప్రణాళికలు, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. హెచ్ఎం రాజారమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్డిపాలెం మోడల్ పాఠశాలలో మాక్ పోలింగ్

రొంపిచర్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వీరెడ్డిపాలెం మోడల్ పాఠశాలలో యాక్టిజన్ క్లబ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 6, 7 తరగతుల విద్యార్థులకు మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. విద్యార్థులు పాల్గొని అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభుదాసు, కరిముల్లా, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొండపాడులో స్పెషల్ ఆఫీసర్ తనిఖీలు

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి ఇంగిలాల మురళి శుక్రవారం మండలంలోని దొండపాడులో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తొలుత గ్రామ సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాలలో మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, శానిటేషన్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామ హెల్త్‌క్లినిక్‌ను, రైతు సేవాకేంద్రాన్ని సందర్శించారు. తనిఖీలో అయన వెంట మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు, వ్యవసాయ విస్తరణ అధికారి బ్రహ్మయ్య, పంచాయితీ సెక్రెటరీ సురేష్, వీఆర్వో నాయక్, పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడాపోటీలు

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 25: ఈ నెల 29, 30వ తేదీలలో జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఆసక్తి గల ప్రభుత్వ ఉద్యోగులు గుర్తింపు కార్డు, ధ్రువపత్రాలతో క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో ఈ నెల 29న హాజరు కావాలన్నారు. వివరాలకు 8712622574లో సంప్రదించాలని కోరారు.

స్కేలింగ్ క్లౌడ్స్ ఫినాప్స్ పుస్తకం ఆవిష్కరణ

నరసరావుపేట టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉపయోగపడే స్కేలింగ్ క్లౌడ్స్ ఫినాప్స్ పుస్తకాన్ని సీఎం చంద్రబాబునాయుడు వెలగపూడి సచివాలయంలో ఆవిష్కరించారని తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి కనుమూరి లక్ష్మి శుక్రవారం తెలిపారు. స్కేలింగ్ క్లౌడ్స్ ఫినాప్స్ పుస్తకాన్ని అమెరికాలో ఉంటున్న కనుమూరి రమేష్, కనుమూరి లక్ష్మి దంపతుల కుమారుడు కనుమూరి శశిధర్ రాశారు. ఈ సందర్భంగా కనుమూరి లక్ష్మి మాట్లాడుతూ ఈ పుస్తకం క్లౌడ్ సామర్థ్యాన్ని పెంపొందించడానికి, డేటా ఆధారిత విషయాలు తీసుకోవడానికి, స్టార్టప్, ఎంబీఏ, ఎంఎస్, కాస్ట్ ఆప్టిమైజేషన్, ఆటోమేషన్, వెండర్ మేనేజ్‌మెంట్‌లో నిపుణత కోసం, సాంకేతిక మెళకువలు, పొదుపు, సమర్థత పెంచేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 2 లోగా స్కూల్ అసిస్టెంట్‌లు దరఖాస్తు చేసుకోవాలి

నరసరావుపేట టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అర్హులైన స్కూల్ అసిస్టెంట్‌లు అసిస్టెంట్ ఐఈ కో ఆర్డినేటర్, అసిస్టెంట్ అకాడమి మోనటరింగ్ ఆఫీసర్ పోస్టులకు నవంబరు 2లోగా దరఖాస్తులు చేసుకోవాలని పల్నాడు జిల్లా సమగ్ర అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎం వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేయుచున్న అర్హులైన స్కూల్ అసిస్టెంట్‌లను దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు అప్లై చేయదలచివారు విడివిడిగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. అసిస్టెంట్ ఏఎంవో ఉర్దూ పోస్టుకు పీజీ సెకండ్ క్లాసులో ఉత్తీర్ణత, హైస్కూల్, ఇంటర్, పీజీ స్థాయిలో ఉర్దూ మాధ్యమంలో చదివి, 5 సంవత్సరాలు అనుభవం ఉండాలన్నారు. అదనపు సమాచారం కోసం పల్నాడు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలన్నారు.

ప్రారంభోత్సవాలతో జనవరిలో పల్లె పండుగ

● పంచాయతీరాజ్ శాఖ ఏఈ వెంకటేశ్వరరావు

ఫటా ఫట్



నాదెండ్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంతో నాదెండ్ల మండలంలోని పలు గ్రామాల్లో రూ.328 లక్షల అంచనా వ్యయంతో సీసీ, తారు, మెటల్ రోడ్లను నిర్మించనున్నట్లు నాదెండ్ల పంచాయతీరాజ్ శాఖ ఏఈ కే వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ అంశాలపై ఆంధ్రజ్యోతి ప్రతినిధితో ఫటాఫట్...

నాదెండ్ల మండలంలో ఎన్ని కిలో మీటర్ల రోడ్ల నిర్మాణం చేయ దలిచారు?

ఏఈ: సుమారు ఐదు కిలో మీటర్లలో రోడ్లను నిర్మించదలిచాం. సీసీ రోడ్లు 2.94 కిలో మీటర్లు, బీటీ రోడ్లు 950మీటర్లు, మెటల్ రోడ్లు సుమారు రెండు కిలో మీటర్ల మేర నిర్మాణం జరపనున్నాం

ఈ పనులను ఎప్పటిలోగా పూర్తి చేయాలనుకుంటున్నారు?

ఏఈ: అన్ని పనులను డిసెంబరులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. శంకుస్థాపనలు చేసిన విధంగానే జనవరిలో ప్రారంభోత్సవాల ద్వారా పల్లె పండుగ నిర్వహిస్తాం.

పనులకు చెల్లింపులు చేసేందుకు నిధులు ఉన్నాయా?

ఏఈ: నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదు. చేసిన పనులకు దశల వారీగా చెల్లింపులు చేస్తాం. పూర్తిచేసిన పనిని బట్టి వారానికి ఒకసారి గురువారం బిల్లులు చెల్లిస్తాం. నిర్మాణం పూర్తిచేసిన 25 రోజుల్లోగానే బిల్లులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాం.

సమస్యలు పరిష్కరించాలని జీవీకి వైద్య మిత్రల వినతి

వినుకొండ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజోతి) రాష్ట్రంలోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య మిత్రల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అసోసియేషన్ అధ్యక్షుడు మాచర్ల బుజ్జి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును పార్టీ కార్యాలయంలో శనివారం కలిసి వినతిపత్రం అందచేశారు. వైద్యమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆరోగ్య బీమా సౌకర్యం అందించాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ న్యాయమైన సమస్యలను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కార్యదర్శి సింగంశెట్టి వెంకటేశ్వర్లు, నాగలక్ష్మీ, మహేశ్వరి, హనుమంతరావు, హరిబాబు నాయక్ పాల్గొన్నారు.



అసోసియేషన్ నాయకులకు చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

ఎన్‌జీవో హోమ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.లక్ష విరాళం

నరసరావుపేట టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో ఎన్‌జీవో హోమ్ నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు రూ.లక్ష విరాళం బుధవారం అందజేశారు. ఎన్జీవో హోమ్ శంకుస్థాపన సమయంలో ఎమ్మెల్యే రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయంలో ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులకు ఈ విరాళం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మర్లపాటి రామకృష్ణ, కార్యదర్శి ఆనంద్, కోశాధికారి కోటిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పీవీఎస్ నాగేశ్వరరావు, ఎస్వీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ సిద్ధి లింగమూర్తి

ప్రజావేదికలో బయటపడిన ఉపాధి అక్రమాలు

● రూ.95,790లు రికవరీకి అధికారుల ఆదేశం

ఈపూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొలతలలో తేడా.. కూలికి రాని వారికి మస్టర్లు.. ఫీల్డ్‌అసిస్టెంట్లు, సాఫ్ట్‌వేర్‌లు, చనిపోయిన వారికి కూలి చెల్లించినట్లు ప్రజావేదికలో సామాజిక తనిఖీ బృందాలు సభ్యులు చదివి విన్పించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై మండలంలో 18 పంచాయితీలలో జరిగిన పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల అనంతరం ప్రజావేదిక నిర్వహించి జరిగిన అక్రమాల గురించి వివరించారు. ఉపాధిహామీ పథకం ద్వారా సాగుచేసిన పండ్ల మొక్కలను తొలగించడంపై విచారణ చేపడతామని అధికారులు తెలిపారు. మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.8.17 కోట్లు పనులు చేశారని డ్వామా పీడీ ఎం సిద్ధిలింగమూర్తి తెలిపారు. బినామి పేర్లుతో రూ.87.827వేలు, సంతకాలు లేకుండా రూ.58.417వేలు, లెక్కల తప్పులతో రూ.480లు రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ బూసిరెడ్డి, ఎంపీడీవో ప్రభాకరరావు, ఎస్ఆర్‌పీ రాజు, ఏపీవో లక్ష్మణరావు పాల్గొన్నారు.

28న శావల్యాపురంలో ప్రజాదర్బార్

శావల్యాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని సత్వరమే పరిష్కరించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఈ నెల 28వ తేదీన శావల్యాపురంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే జీవీ అంజనేయులు పాల్గొని ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొంటారన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటలోపు కార్యక్రమానికి హాజరై సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని కోరారు.

ప్రభుత్వ శాఖల పనితీరుపై ఎంపీడీవో తనిఖీలు

శావల్యాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. శావల్యాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులను కలసి వారికి అందిస్తున్న వైద్యసేవలు, సదుపాయాల గురించి ఆరా తీశారు. పీహెచ్‌సీలో రికార్డులు, ఓపీలు, ఆన్‌లైన్ నమోదు, మందుల నిల్వలు, ల్యాబ్ పరీక్షలు తదితర అంశాలను పరిశీలించి వైద్యసిబ్బందికి తగిన సూచనలు అందజేశారు. అనంతరం మండల సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కొత్తలూరు సచివాలయంలో రికార్డులు, సిబ్బంది పనితీరు, ప్రజలకందిస్తున్న సేవల వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు, ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు, వైద్యాధికారి రావిపూడి రమ్య తదితరులు పాల్గొన్నారు.

పలు సమస్యలపై పోరాడిన సీపీఐ: మారుతీ వరప్రసాద్

వినుకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పలు సమస్యలపై సీపీఐ గడిచిన 100 సంవత్సరాలుగా పోరాటాలుచేసి ఎన్నో విజయాలు సాధించిందని పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతీ వరప్రసాద్ తెలిపారు. సీపీఐ శత దినోత్సవ వేడుకల్లో భాగంగా పట్టణంలోని శివయ్య డివిజన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో మారుతీవర ప్రసాద్ మాట్లాడుతూ డిసెంబరు 26 తేదీ నాటికీ, సీపీఐ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లాలోని అన్ని పార్టీ శాఖల వద్ద అరుణ పతాకాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంగమ్మ, మస్తాన్, ప్రశాంతి, పేరమ్మ, లక్ష్మీ, రామయ, వరదరాజులు, భాస్కర్, ఆనంద్, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ కళాశాలలో వైద్య శిబిరం

నాదెండ్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలోని చుండి రంగనాయకులు కళాశాలలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సెరీన్ స్కిన్, హెయిర్ క్లినిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో చర్మ వ్యాధి నిపుణులు డాక్టర్ రాకేష్ వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులకు చర్మ, జుట్టు సంబంధిత వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ చైతన్య, కళాశాల వ్యవస్థాపకులు చుండి రంగనాయకులు మనుమడు రంగనాయకులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఈ నిరంజన్, ఐ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.